నేడు TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

శనివారం | 13.06.2026 | సంపుటి : 4 | సంచిక : 47 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com




మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు 08

## సమ్మక్క బ్యారేజీకి
# మార్గం సుగమం

**ప్రాజెక్టు ఎన్‌ఓసీ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ**

**అంతర్రాష్ట్ర సత్సంబంధాలతో ప్రాజెక్టు అనుమతులకు వేగం**

**ముంపు ప్రభావిత భూములకు చట్టబద్ధ పరిహారం చెల్లించేందుకు సిద్ధం**

**4.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు భారీ ఊతం**

**రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా అదనంగా 30 వేల ఎకరాలకు సాగునీరు**


**ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ**



గోదావరి నదిపై నిర్మించ తలపెట్టిన సమ్మక్క?సారక్క బ్యారేజ్ / సమ్మక్క సాగర్ ప్రాజెక్టు అనుమతుల సాధనలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు పడిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం రాత్రి హైదరాబాద్‌కు వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితో హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘనంగా స్వాగతించారు.

**హైదరాబాద్, జూన్ 12 :** రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల బృందంతో కలిసి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రితో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో ఛత్తీస్‌గఢ్?తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో నిర్మించ తలపెట్టిన సమ్మక్క?సారక్క ప్రాజెక్టుపై సుదీ-ర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన అభ్యంతర రహిత పత్రం, ఎన్‌ఓసీ జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక విజ్ఞాపన పత్రాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి సమర్పించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోదావరి జలాల వినియోగం, పెండింగ్ నీటిపారుదల ప్రాజెక్టుల పూర్తి, రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమ్మక్క-సారక్క బ్యారేజ్ తెలంగాణ రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని ఆయన వివరించారు. ఛత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి గారు తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, అంశాన్ని సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఈ పరిణామం సమ్మక్క-సారక్క ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర జల సంఘంలోని అంతర్రాష్ట్ర వ్యవహా రాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు

-మిగతా 2 లో..



### పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి 04



### ముడిచమురు సరఫరాలో అంతరాయం

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు 04
- పెట్రోల్ బంకులపై కేంద్రం ఆంక్షలు



## శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ

**తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి**

**తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు**

**కేటీఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు**

**హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా**

**మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు**

**మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్**

**ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ**

**న్యూఢిల్లీ, జూన్ 12 :** తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చున్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 243 (కిలో) |
| స్కిన్ లెస్ | 275 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82

## మీనాక్షికి సుప్రీంలో
# దక్కని ఊరట

**నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత**

**ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన**



న్యూఢిల్లీ, జూన్ 12 : రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం

-మిగతా 2 లో..




# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

**షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్, జూన్ 12 :** తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0

-మిగతా 2 లో..

## మార్చి నాటికి బీబీనగర్ ఎయిమ్స్
# అందుబాటులోకి...

**కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి**



హైదరాబాద్, జూన్ 12 : బీబీనగర్‌లో నిర్మిస్తున్న ఎయిమ్స్ ఆసుపత్రిని వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చి నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. అమీర్‌పేట, సనత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమీర్‌పేట యూపీహెచ్‌సీలో మీడియాతో మాట్లాడారు. "నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత

-మిగతా 2 లో..

## యధాతథంగా
# సింగరేణి మెడికల్ బోర్డు

**పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి**

**అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం భట్టి**



**హైదరాబాద్, జూన్ 12 :** సింగరేణి కార్మికులకు తెలం గాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభిం చనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు

-మిగతా 2 లో..




## 25 నుంచి ఇంటింటి
# సర్వే గణన

**సర్ ప్రక్రియకు పార్టీలన్నీ సహకరించాలి**

**రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి**

**హైదరాబాద్, జూన్ 12 :** ఈ నెల 25 నుండి జరగబోయే ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసి సర్వే కార్యక్రమం సజావుగా జరిగేవిధంగా అన్ని రాజకీయ పార్టీలను తెలంగాణ ఎన్నికల కమిషనర్ సి. సుదర్శన్ రెడ్డి కోరారు. శుక్రవారం బి ఆర్ కె భవన్ లోని సిఇఓ కార్యాలయంలో ఎస్ఐఆర్ పక్రియపై అన్ని రాజకీయ

-మిగతా 2 లో..

## మీనాక్షి వ్యవహారంపై
# సిట్ వేయగలరా?

**ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి**

**రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ**

**మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, జూన్ 12 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు. మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో

-మిగతా 2 లో..



## శాంతిభద్రతల కారణంగానే
# పవన్ సభకు నిరాకరణ

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తానని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఈ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే కేంద్రం నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోలా ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సీఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదాపూర్వకంగానే ఆయనను కలిసినట్లు తెలిసింది.



# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

# యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.




# 25 నుంచి ఇంటింటి సర్వే గణన

(మొదటిపేజీ తరువాయి)

పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సిఇఒ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులను తొలగించి స్వచ్ఛమైన ఓటరు జాబితాను తయారు చేసేందుకే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనికి అన్ని రాజకీయ పార్టీల వారు రాష్ట్రంలో సజావుగా నిర్వహించేందుకు తమ సహాయసహకారాలు అందజేయాలని సిఇఓ కోరారు. ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఈనెల 25 నుండి జులై 24 వరకు ఇంటింటి సర్వే గణన ప్రారంభం కానునందున బిఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందిస్తారని, వీటిని పూరించే విషయంలో రాజకీయ పార్టీలు వారి బిఎల్ఎ ద్వారా సరైన విధంగా ఎన్యుమరేషన్ పక్రియను పూర్తి చేసేందుకు సహకారాలను అందించాలని, ఇందుకు సంబంధించి బిఎల్ఎలకు తగిన అవగాహన కల్పించాలని, ఎస్ఐఆర్ పై ప్రజలకు ఎలాంటి అపోహలు, అనుమానాలు కలుగకుండా ప్రజలకు తమవంతు బాధ్యతగా ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశంపై అవగాహన కల్పించాలని సూచించారు. సర్వే జరిగే సమయంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్య తెలెత్తకుండా సహకరించాలని కోరారు.

# సమ్మక్క-సారక్క బ్యారేజ్‌కు మార్గం సుగమం

(మొదటిపేజీ తరువాయి)



ఇప్పటికే అనుమతులు లభించాయని మంత్రి వెల్లడించారు. ఎన్‌ఓసీ లేకపోవడం వల్ల మాత్రమే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని మంత్రి తెలిపారు. మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందన్నారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం బీజాపూర్ జిల్లాలో సర్వే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన పక్షంలో చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైతే పరిహార మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. సమ్మక్క,సారక్క ప్రాజెక్టు మూలాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన పీవీ నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి పథకంలో ఉన్నాయని మంత్రి వివరించారు. గోదావరి నదిపై కంతనపల్లి వద్ద బ్యారేజ్ నిర్మించి ఎస్సారెస్పీ స్టేజ్?2 ఆయకట్టును స్థిరీకరించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించబడిందన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జీఓ ఎంఎస్ నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటిపారుదలరంగ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రాజెక్టును పునఃరూపకల్పన చేశారని మంత్రి తెలిపారు. సాంకేతిక అధ్యయనాల అనంతరం బ్యారేజ్‌ను ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా మరింత ప్రయోజనకరమని తేలిందన్నారు. ఈ మార్పుతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందని వివరించారు. సమ్మక్క-సారక్క బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్?2 కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నట్లు మంత్రి తెలిపారు. అదనంగా రామప్ప-పాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 96,494 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 85,774 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 22,422 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,111 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. రామప్ప?పాకాల లింక్ కాలువ ద్వారా ములుగు జిల్లాలో 8,000 ఎకరాలు, వరంగల్ నర్సంపేట ప్రాంతంలో 22,000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. జె. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలోని కొంత ఆయకట్టు స్థిరీకరణకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందలాది గ్రామాలకు తాగునీటి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను 2021 ఆగస్టు 31న కేంద్ర జల సంఘానికి సమర్పించినట్లు మంత్రి తెలిపారు. హైడ్రాలజీ డైరెక్టరేట్, కాస్ట్ ఎస్టిమేట్స్ డైరెక్టరేట్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర భూగర్భ జల మండలి సహా పలు ప్రధాన అనుమతులు ఇప్పటికే లభించాయని చెప్పారు. 2024 జూలై నుంచి 2026 జనవరి వరకు కేంద్ర జల సంఘం కోరిన వివరణలన్నింటికీ తెలంగాణ నీటిపారుదల శాఖ సమగ్ర సమాధానాలు సమర్పించిందన్నారు. ఎన్‌ఓసీ సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లుగా నిరంతరంగా కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ 26, ఆగస్టు 12, 2025 జనవరి 24, ఏప్రిల్ 23 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అధికారిక లేఖలు రాసినట్లు తెలిపారు. 2025 సెప్టెంబర్ 22న రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. అంతే గాకుండా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ తో, కేంద్ర జల సంఘం చైర్మన్‌తో కూడా ఈ అంశంపై చర్చలు జరిపినట్లు మంత్రి తెలిపారు. 2025 నవంబర్, డిసెంబర్ నెలల్లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ప్రత్యేక విజ్ఞప్తులు పంపి అనుమతుల పక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు వివరించారు. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతుండటం, తెలంగాణ ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేయడం, ముంపు ప్రభావితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ముందుకు రావడం, రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వాతావరణం నెలకొనడం వల్ల ఎన్‌ఓసీ త్వరలోనే లభించే అవకాశాలు మెరుగయ్యాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. త్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎన్‌ఓసీ జారీ చేసిన వెంటనే కేంద్ర జల సంఘం అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ డీపీఆర్ తుది పరిశీలన పూర్తి చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దీంతో సమ్మక్క?సారక్క బ్యారేజ్ అమలుకు ఉన్న చివరి ప్రధాన పరిపాలనా అడ్డంకి కూడా తొలగిపోయే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. ల్గ÷తుల ప్రయోజనాలు, సాగునీటి భద్రత, తాగునీటి అవసరాలు, అంతర్‌రాష్ట్ర సత్సంబంధాలు ? ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం సమ్మక్క-సారక్క ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

(మొదటిపేజీ తరువాయి)




ఎన్నికల పక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్' దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల పక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

# వచ్చే మార్చి నాటికి బీబీనగర్ ఎయిమ్స్ అందుబాటులోకి..

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలకు ముఖ్యంగా తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి రూ.5 లక్షల మేర ఉచిత వైద్యం అందించేలా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమల్లోకి తెచ్చారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ ఆసుపత్రిని, బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. ఈఎస్ఐసీ ఆసుపత్రిలో నిర్మించిన కొత్త ఓపీ బ్లాక్‌ను కూడా త్వరలో ప్రారంభిస్తాం. రూ.వెయ్యి కోట్లతో అదనపు భవనాలు, హాస్టల్ వసతులు, మరిన్ని పడకలు ఏర్పాటు చేసి ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సామర్థ్యాన్ని మరింత పెంచుతాం. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని యూపీహెచ్‌సీల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించనున్నాం. అవసరమైన వైద్య పరికరాలను కూడా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటాం" అని చెప్పారు.

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

- నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు
- హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

**సిద్ధిపేట, జూన్ 12:** సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

# మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

(మొదటిపేజీ తరువాయి)

కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్ధ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోట ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

# రాజ్యసభకు 24మంది ఏకగ్రీవ ఎన్నిక

## విజేతల జాబితాలో ఖర్గే, తరుణ్ చుగ్

**న్యూఢిల్లీ, జూన్ 12:** రాజ్యసభకు ఈనెల 18న ఎన్నికలు జరగాల్సి ఉండగా దీనికి ముందే పోటీ లేకుండా 24 మంది పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బీజేపీ జాతీయ కార్యదర్శి తరుణ్ చుగ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో ఉన్నారు. మొత్తం 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా వీటిలో 24 స్థానాలకు ఫలితాలు ప్రకటించారు. గెలుపొందిన అభ్యర్థులకు విన్నింగ్ సర్టిఫికెట్లను రిటర్నింగ్ అధికారులు అందజేశారు. రాజ్యసభలో ఎన్డీయే సంఖ్యాబలం 16 కాగా, తాజాగా మరో ముగ్గురు గెలవడంతో ఆ బలం 19కి చేరింది. కాంగ్రెస్ 5 సీట్లు గెలుచుకోగా, నాలుగు సీట్లు ఇంతకు ముందే ఆ పార్టీకి ఉన్నాయి. దీంతో రాజ్యసభలో కాంగ్రెస్‌కు ఒక సీటు మాత్రమే పెరిగింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో 3 సీట్లు కోల్పోయింది. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బిజూ జనతాదళ్ సైతం తన సీట్లు బీజేపీకి కోల్పోయింది. బీజేపీ అభ్యర్థి దేబాశిష్ సమంతరాయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమంతరాయ్ మే 26న బీజేడీ రాజ్యసభ పదవి వదిలి బీజేపీలో చేరారు. తిరిగి బీజేపీ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే నాలుగు సీట్లు గెలుచుకోగా, గుజరాత్‌లోని నాలుగు సీట్లను కూడా ఎన్డీయే ఎగరేసుకుపోయింది. అయితే కర్ణాటకలో కాంగ్రెస్ 3 సీట్లు గెలుచుకోగా, బీజేపీ ఒక సీటు దక్కించుకుంది. మధ్యప్రదేశ్‌లోని మొత్తం 3 సీట్లు, రాజస్థాన్‌లోని 3 సీట్లలో రెండు సీట్లు బీజేపీ గెలుచుకుంది. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్‌లోని ఒక్కో స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. మేఘాలయలో ఎన్డీయే భాగస్వామి అయిన ఎన్‌పీపీ అక్కడి ఏకైక స్థానాన్ని గెలుచుకుంది. మహారాష్ట్ర, ఒడిశాలోనూ ఒక్కోసీటును ఎన్డీయే దక్కించుకోగా, తమిళనాడులోని ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ గెలుచుకుంది.

# హైదరాబాద్‌లో ప్రతికూల వాతావరణం

## సిఎం రేవంత్ ప్రయాణిస్తున్న ఇండిగో బెంగుళూరుకు మళ్లింపు

**హైదరాబాద్, జూన్ 12:** హైదరాబాద్‌లో భారీ వర్షం, ఈదురుగాలుల కారణంగా ఏర్పడ్డ ప్రతికూల వాతావరణంతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రయాణిస్తున్న విమానాన్ని దారి మళ్లించారు. హైదరాబాద్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా దిల్లీ నుంచి శంషాబాద్ వస్తున్న విమానాన్ని బెంగళూరుకు డైవర్ట్ చేశారు. రేవంత్‌రెడ్డి సాయంత్రం 6.30 గంటలకు దిల్లీ నుంచి ఇండిగో విమానంలో బయలుదేరారు. హైదరాబాద్‌లో వర్షం కారణంగా ప్రతికూల పరిస్థితులు ఏర్పడటంతో విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. చందానగర్, మియాపూర్, జేఎన్టీయూ, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, సనత్‌నగర్, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, నాంపల్లి, అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, నారాయణగూడ ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలుచోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి.పలుచోట్ల ఈదురుగాలులు వీస్తున్నాయి. వర్షానికి ప్రధాన రహదారిపైకి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

# రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

- ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం
- కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం



**కరీంనగర్, జూన్ 12 :** రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత కరెంటూ పోయింది. కాంగ్రెస్ నేతలు అబద్దాలు చెబుతున్నారు. రైతులు ఆ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛను ఇవ్వడం లేదు. ప్రభుత్వ సొమ్ము రూ.100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు ఉంటాయి కానీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతుబీమాకు ఉండవా? రైతులకు డబ్బు ఇచ్చేందుకు రేవంత్‌కు మనసు రావడం లేదు. ఆయనకు అధికారం మత్తెక్కింది. హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.



## సర్ ప్రక్రియ.. ఓ భూతం లాంటిది

- చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం, జూన్ 12 :** ఎస్ఐఆర్(సర్) భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్టాల్లో్ర అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ధి పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

**క్రీడారంగానికి తీరని లోటని ప్రధాని సంతాపం**

**న్యూఢిల్లీ, జూన్ 12 :** దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్ షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ధృవీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు గెలిచిన జస్పాల్.. గతంలో జాతీయ జూనియర్ కోచ్‌గా వ్యవహరించారు. అప్పుడే మను బాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులైన షూటర్లు వెలుగులోకి వచ్చారు. ఒలింపిక్స్ విజయాల అనంతరం ఆయన గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ కోచ్‌గా నియమితులయ్యారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరనిలోటన్నారు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# అహ్మదాబాద్ ఎయిరిండియా ఘటనకు ఏడాది

- దుర్ఘటనపై దర్యాప్తు పురోగతిలో ఉంది
- ప్రమాదంపై ఇంకా దుష్ప్రచారాలు చేయడం తగదు
- కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూఢిల్లీ, జూన్ 12 :** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ ఘటన జరిగి నేటికి ఏడాది అయింది. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి స్పందించారు. ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పుడు ప్రచారాలు చేయొద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. విమాన ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందన్నారు. ప్రమాదంపై త్వరలో తుది నివేదిక వస్తుందని.. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంతర్జాతీయ సమీక్షలు, సంప్రదింపు ప్రక్రియలు పూర్తయిన తర్వాత విమాన ప్రమాదంపై తుది నివేదిక విడుదల చేస్తామని ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏబీఐ) వెల్లడించింది. ప్రమాదానికి అసలు కారణం తెలుసుకొనేందుకు ఫ్లైట్ రికార్డర్ డేటా, ఇంజిన్ భాగాలు, ఇతర ఆధారాలను విశ్లేషిస్తున్నామని తెలిపింది. ఇప్పటివరకు దర్యాప్తులో గణనీయమైన పురోగతి సాధించామని.. అందులో కనుగొన్న విషయాలను నిర్ధరించుకొనేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొంది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే. ఆ ప్రమాదంలో విశ్వాస్ కుమార్ అనే వ్యక్తి మాత్రమే ప్రాణాతో బయటపడ్డారు. విమానం హాస్టల్ భవనంపై కూలడంతో మృతుల సంఖ్య 260కి చేరింది. బాధిత కుటుంబాలకు టాటాగ్రూప్ నష్ట పరిహారం చెల్లించింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇదిలావుంటే ఆ విమానం కూలిన హాస్టల్ భవనం స్థానంలో రూ.547 కోట్లతో మెడికల్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర మంత్రి ప్రఫుల్ పన్సేరియా వెల్లడించారు. వైద్య విద్యార్థులకు కొత్త అవకాశాలు కల్పించేందుకు దీనిని ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. 15 బాధిత కుటుంబాలు తమ ఆత్మీయుల వ్యక్తిగత వస్తువులను స్వీకరించడానికి నిరాకరించా యని ఎయిరిండియా మాతృ సంస్థ టాటా గ్రూప్ శుక్రవారం వెల్లడించింది. 91 శాతం కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహార చెల్లింపును పూర్తిచేశామని తెలిపింది. పత్రాలు సరిగా లేని, పరిహార స్వీకరణకు నిరాకరించిన కేసుల్లో పరిహార చెల్లింపు ప్రక్రియ పూర్తికాలేదని చెప్పారు. 96 శాతం బాధిత కుటుంబాలకు మధ్యంతర పరిహారం కింద రూ.25 లక్షలు అందించామని పేర్కొంది.

## ఏసీబీకి చిక్కిన ఎంపీడీవో, ఎంపీవో

**లంచం తీసుకుంటుండగా పట్టివేత**

**పటాకులు కాల్చి సంబరం చేసుకున్న గ్రామస్థులు**

**మహబూబాబాద్, జూన్ 12 :** భూమి లేఅవుట్ అభివృద్ధి పనులకు లంచం తీసుకున్న ముగ్గురిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సిములపేట మండలానికి చెందిన ఎంపీడీవో రాధిక, ఆమె కుమారుడు నాగార్జున, ఎంపీవో యాకయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మండలంలోని పద్మావతిగూడెం గ్రామంలో లేఅవుట్‌కు సంబంధించిన భూమిని గ్రామ పంచాయతీ వద్ద తాకట్టు పెట్టేలా పంచాయతీ సచివాలయానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాధితుడు ఎంపీడీవో రాధికను, ఎంపీవో యాకయ్యను సంప్రదించాడు. దీంతో వారు లంచం డిమాండ్ చేయడంతో శుక్రవారం ఎంపీడీవో కుమారుడు నాగార్జునకు మెంత్తం 45 వేల రూపాయలు అందజేశాడు. దీంతో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కాగా ఎంపీడీవో రాధిక ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో స్థానికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

## ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ వివక్ష

- హెల్త్ కార్డులు ఇవ్వకుండా రాజకీయం
- మండిపడ్డ మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్



**హైదరాబాద్, జూన్ 12 :** ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులకు తక్కువ చేసి చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల తెలంగాణలో 10 నుంచి 15 లక్షల కుటుంబాల ఉద్యోగులు, పెన్షన్ దారులు ఆందోళనలో ఉన్నారని ఆరోపించారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర యేండ్లలో ఇంతవరకు ఉద్యోగులకు, పెన్షన్ దారులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వలేదని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని అన్నారు. హెల్త్ కార్డ్స్ ఇష్యూపై కమిటీ వేశారే తప్పా హెల్త్ కార్డ్స్ మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. కమిటీ ముఖ్యమంత్రి మాట వినడం లేదా? ముఖ్యమంత్రి మాట కమిటీ వినడం లేదా అర్థం కావడం లేదని విమర్శించారు. పీఆర్సీ 6 నెలల్లో క్లియర్ చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు. బీఆర్ఎస్ హయంలో ఉద్యోగులను కాపాడుకున్నా మని వెల్లడించారు. ఒక్కో ఉద్యోగి నుంచి నెలకు 2 వేల నుంచి 3 వేల వరకు డబ్బులు కట్ అవుతున్నాయి. ఉద్యోగి జీతం నుంచి డబ్బులు కట్ చేయమని ఈ ప్రభుత్వానికి చెప్పింది ఎవరని ప్రశ్నించారు. ఉద్యోగులను తక్కువ చేసి చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యం విషయంలో ఉద్యోగులు చనిపోతే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జూన్ 1 నుంచి హెల్త్ కార్డ్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. హెల్త్ కార్డ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తుందని దేవి ప్రసాద్ అన్నారు. ద్యోగి సమ్మతి లేకుండా జీతం కట్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదని తెలిపారు. కేసీఆర్ పరిపాలనలో అంగన్‌వాడీ వర్కర్స్ కు ఏ రాష్ట్రంలో లేని విధంగా జీతాలు ఇచ్చారని గుర్తు చేశారు.

## టిప్పర్ కిందపడి తల్లి మృతి

**కొడుకుకు తీవ్ర గాయాలు**

**రంగారెడ్డి,జూన్12 :** గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి చెందగా.. కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందుకూరు మండలం బేకరి కంచకు చెందిన భారతమ్మ (45), ఆమె కొడుకు అఖిల్(16)తో కలిసి ద్విచక్ర వాహనంపై ఆకుల మైలారంలోని ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. దారిలో ఎదురుగా వచ్చే మరో టిప్పర్‌కు దారి వదలడానికి టిప్పర్ డ్రైవర్ బ్రేక్ వేశాడు. బైక్‌పై వచ్చిన తల్లి, కుమారుడు టిప్పర్ వెనుక భాగంలో బైక్‌ని ఆపారు. ఇది గమనించని డ్రైవర్ టిప్పర్‌ని వెనక్కి తోలాడు. ఈ క్రమంలో భారతమ్మ టిప్పర్ వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. అఖిల్ రెండు కాళ్లపై నుంచి టిప్పర్ చక్రం వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని హుటాహుటిన నగరంలోని ఆసుపత్రికి తరలించారు. అఖిల్ ఇటీవల పదో తరగతి పూర్తి చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ చెప్పారు.

## తిరుగుబాటు ఎంపిల కొత్త ఎత్తుగడ

**తమదే అసలైన టిఎంసిగా వాదన**

**స్పీకర్ ఓంబిర్లాను కలిసి వివరించేందకు సన్నద్ధం**

**న్యూఢిల్లీ, జూన్ 12 :** తృణమూల్ కాంగ్రెస్ లో తలెత్తిన సంక్షోభం పతాక స్థాయికి చేరుతున్నాయి. తమదే అసలైన టిఎంసి అని తిరుగుబాటు దారులు ప్రకటించే సంకేతాలు కనిపిస్తున్నాయి. పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో రగులుతున్న తిరుగుబాటు ఎంపీలు తమదే 'నిజమైన టీఎంసీ' పార్లమెంటరీ గ్రూప్ అని క్లెయిమ్ చేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలుసుకోనున్నారు. ఈ విషయాన్ని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా ధృవీకరించారు. ఇప్పటికే తమ గ్రూపు స్పీకర్‌కు ఒక రిప్రజెంటేషన్ సమర్పించిందని, తమను 'రియల్ టీఎంసీ' పార్లమెంటు గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు ఈనెల 15న మరోసారి కలుసుకోనున్నామని రెబల్ ఎంపీ జగదీష్ చంద్ర బర్మా బసునియా తెలిపారు. ప్రత్యేక పార్లమెంటరీ గ్రూపు ఏర్పాటుకు, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయేకు మద్దతించేందుకు రెబల్ ఎంపీలు పట్టుదలగా ఉండగా, వారికి మద్దతిస్తున్న వారిలో బసునియా ఉన్నారు. ఆయన కూచ్ బెహర్ నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీ ఎంపీలను ఫిరాయింపులకు కొందరు ప్రోత్సహిస్తున్నారంటూ టీఎంసీ ఎంపీ కీర్తి అజాద్ చేసిన ఆరోపణలను బసునియా తోసిపుచ్చారు. ఆయన అబద్ధలాకోరు అనీ, ఆ విధంగా చెప్పడం సరికాదని అన్నారు. తాము 19 మంది ఎంపీలమనీ, ఆయన కూడా ఒక ఎంపీయేనని, ఇలాంటి ఆరోపణలు చేయడం మంచిదికాదని చెప్పారు. తిరుగుబాటు ఎంపీలకు కకోలీ ఘోష్ దస్తిదార్ నాయకత్వం వహిస్తున్నారు. లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్టుగా ఆమె ఇటీవల ప్రకటించారు. ఈ గ్రూపులో శతాబ్దీ రాయ్, యూసుఫ్ పఠాన్, సయోనీ ఘోష్, శత్రుఘ్నసిన్హా తదితర ఎంపీలు ఉన్నారు.

## చిన్నారితో కలిసి భవనం పైనుంచి దూకిన యువతి

**తల్లి మృతి.. చిన్నారికి తీవ్రగాయాలు**

**హైదరాబాద్, జూన్ 12 :** హైదరాబాద్ నగరంలోని మియాపూర్ పీఎస్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. చిన్నారితో కలిసి ఆరో అంతస్తు నుంచి దూకి మహిళ మృతిచెందింది. మయూరినగర్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈషా సాహూ (37) అనే మహిళ ఆరు నెలల కుమార్తెను తీసుకుని అపార్ట్‌మెంట్ ఆరో అంతస్తు నుంచి కిందికి దూకేసింది. ఈ ఘటనలో ఈషా అక్కడికక్కడే మృతిచెందగా.. చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. చిన్నారిని స్థానికులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రెండో బిడ్డ జన్మించిన తర్వాత ఈషా తీవ్ర మానసిక ఒత్తిడికి గురైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బడిలోనే దేశ భవిష్యత్‌కు పునాది!



**విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు.**

పాఠశాలలతో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే.. సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే... స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టిల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది.

గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్దం చేస్తే మంచిది. ఇందుకు తల్లిదదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయబడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి



**న్యూఢిల్లీ, జూన్ 12 :** పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్‌ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భ ంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

## మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతిపై
# సమగ్ర దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్, జూన్ 12 :** మామిడి పండ్లు తిని అక్కాచెల్లెళ్ల మృతి ఘటనపై నారాయణగూడ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మామిడి పండ్లు తిని భువనేశ్వరి(17), సంధ్య(10) తీవ్ర అస్వస్థకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటక బీదర్ వాసులు వైజినాథ్, ఇందుమతి దంపతులు కొన్నాళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చారు. ఇందుమతి బంధువు రేణుక ఈనెల జలమండలి వద్ద రెండు కేజీల మామిడి పండ్లను కొనుగోలు చేసింది. ఆ పండ్లను ఇందుమతి, ఆమె నలుగురు కుమార్తెలు తిన్నారు. ఆపై వారంతా వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. చికిత్స పొందుతూ అక్కాచెల్లెళ్లు భువనేశ్వరి(17), సంధ్య(10) మృతి చెందగా.. మిగిలిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి మామిడి పండ్లు తొందరగా మగ్గేందుకు వినియోగించే రసాయనాలు కారణమా?... లేక ఇతర పదార్థాల వల్ల జరిగిందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, వైద్యుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఫుడ్, ఫ్రూట్ నమూనాలను సేకరించిన అధికారులు.. పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. గత నెలలో ఛత్తీస్‌గఢ్ జాంజ్ గిరి-చంపా జిల్లాలో పుచ్చకాయ తిని 15 ఏళ్ల బాలుడు మరణించగా, మరో ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో వరుస ఘటనలతో మామిడి పండ్లు, పుచ్చకాయలు కొనాలంటే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో సమగ్ర దర్యాప్తు చేపట్టామని కమిషనర్ సజ్జన్నార్ తెలిపారు.

## స్కూలు డ్రెస్సుల కుంభకోణం

**వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే**

**హైదరాబాద్, జూన్ 12 :** స్కూల్ డ్రెస్సులను కూడా మహిళా సంఘాలకు అప్పగిస్తామని గతంలో సిఎం ప్రకటించినట్లు సమాచారం. వారికి ఈ పని అప్పగిస్తే మరింత మంచి ఫలితం వస్తుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కాంట్రాక్టును గుజరాత్ కంపెనీకి అప్పగించారని విపక్ష నేత హరీష్ రావు చేసిన ఆరోపణలపై నిజాలు వెలుగు చూడాల్సి ఉంది. గుజరాత్ కాంట్రాక్టర్ల పేరుతో విద్యాశాఖలో రూ.2000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కాంట్రాక్టులు, కమిషన్ల కోసమే పాఠశాలల పునఃప్రారంభం వాయిదా వేశారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత చేనేత కార్మికులకు, షూ, బెల్టుల తయారీ దళిత కుటుంబాలు బతకాలని లిడ్ క్యాప్‌కు ఇచ్చామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం వాటిని సెంట్రలైజ్ చేసి.. గుజరాత్ కాంట్రాక్టర్‌కు అప్పగించారని మండిపడ్డారు. ఆ గుజరాత్ కాంట్రాక్టర్ నుంచి ఇంతవరకు బట్టలు రాలేదని, 7 లక్షల మంది గురుకుల విద్యార్థులకు ఇవ్వాల్సిన బ్యాగులు, డ్రెస్సులు, బెల్టులు, పుస్తకాలు ఏవీ అందలేదన్నారు.

# ముడిచమురు సరఫరాలో అంతరాయం

- ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు
- పెట్రోల్ బంకులపై కేంద్రం ఆంక్షలు



**న్యూఢిల్లీ, జూన్ 12 :** పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.



## ప్రజలు ఆమోదిస్తేనే
# పొలిటికల్ ఎంట్రీ

**నటుడు రాఘవ లారెన్స్ పోస్ట్**

**చెన్నై, జూన్ 12 :** ప్రముఖ నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ తన రాజకీయ ప్రవేశంపై మరోమారు స్పష్టత ఇచ్చారు. ప్రజలు ఆమోదిస్తేనే తాను రాజకీయాల్లోకి వస్తానని స్పష్టం చేశారు. ప్రజలు కాదంటే రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో రాఘవ లారెన్స్ ఓ వీడియో పోస్టు చేశారు. ఆ వీడియోలో తన రాజకీయ భవిష్యత్ గురించి వివరించి చెప్పారు. తుది నిర్ణయాన్ని ప్రజలకే వదిలేశారు. పొలిటికల్ ఎంట్రీపై త్వరలో ప్రకటన చేస్తానని చెప్పారు. లారెన్స్ తన పోస్టులో.. 'ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా.. మీ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించండి. ఈ వీడియో చూసిన తర్వాత, దయచేసి మీ సలహాలను, మార్గదర్శకత్వాన్ని కామెంట్స్ రూపంలో పంచుకోండి. మీరు 'వద్దు' అని చెబితే.. నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవను ఇలాగే కొనసాగిస్తాను. కానీ మీరు 'అవును' అని చెబితే.. మీ అందరి ఆశీస్సులతో ఈ రాజకీయ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో కలిసి ప్రారంభించాలో నిర్ణయించుకుంటాను' అని పేర్కొన్నారు.

## ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్
# ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

**ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు**



**న్యూఢిల్లీ, జూన్ 12 :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.



## సంతాన సాఫల్యానికి కొత్త ఆశలు
# నింపనున్న హీరా ఫెర్టిలిటీ సెంటర్

**స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో కలిసి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని గుప్తా ఎన్‌క్లేవ్, ఆశ్విన్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన హీరా ఫెర్టిలిటీ సెంటర్ను తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు, నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, సంతానం కోసం ఎదురుచూస్తున్న దంపతులకు హీరా ఫెర్టిలిటీ సెంటర్ కొత్త ఆశలను అందిస్తుందని అన్నారు. అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ప్రజారోగ్యానికి ఇలాంటి ప్రత్యేక వైద్య కేంద్రాలు మరింత అవసరమని పేర్కొన్న ఆయన, సెంటర్‌ను స్థాపించిన డాక్టర్ ఫజలున్నీసా మరియు డాక్టర్ సుజన భట్టారు సేవలను అభినందించారు.

# భారత నౌకపై దాడి హేయమైన చర్య

**దాడిని తీవ్రంగా ఖండించిన పీర్జాదిగూడ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష**



**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న భారత నౌక పై అమెరికా దాడిని పీర్జాదిగూడ బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జిలాని భాష తీవ్రంగా ఖండించారు. ఒమన్ తీరంలో అమెరికా జరిపిన దాడిలో మృతి చెందిన ముగ్గురు భారత నౌకాదళం సిబ్బందికి ఆయన సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా "నేడు" ప్రతినిధితో శుక్రవారం జిలాని భాష మాట్లాడుతూ.. భారత నౌకపై అమెరికా జరిపిన దాడి హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపివేయాలని ఆయన కోరారు. అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని ఆయన కోరారు. ఇరాన్ నుండి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించడం వల్లే నౌకపై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం పేర్కొనడాన్ని ఆయన ఖండించారు. ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం భారత నౌక పై దాడి చేయడం ఇది రెండవసారి అని, ఇటువంటి దాడులను ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాలని జిలాని పాషా కోరారు. ఇకపై ఇటువంటి దాడులను భారత్ చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ఓవైపు ఇరాన్ పై దాడులు నిలిపివేస్తున్నామని పదేపదే తెలిపిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత నౌకలపై దాడిని ఏ విధంగా సమర్థించుకుంటారని ఆయన ప్రశ్నించారు.

# సర్కారు బడి.. సమస్యల ఒడి

- సమస్యలతో స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- కాలం మారుతున్నా మారని ప్రభుత్వ విద్యాలయాల తీరు
- శిథిలావస్థలో తరగతి గదులు, మరుగుదొడ్ల తీవ్ర కొరత
- మధ్యాహ్న భోజనానికి వంట గదుల సెగ
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాడుబడ్డ పాఠశాల భవనాలు
- ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యటన
- ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన డిమాండ్లు

**మేడ్చల్, నేడు న్యూస్ :** ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను పెంపొందించాలన్న ప్రభుత్వ సంకల్పానికి, అదే సర్కారు నిర్లక్ష్య ధోరణి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ





పాఠశాలల్లోని మౌలిక వసతుల లేమి, ఇతర తీవ్ర సమస్యలు విద్యార్థుల భవిష్యత్తును సతమతం చేస్తున్నాయి. ెప్టంలో కాలం మారుతున్నా ప్రభుత్వ విద్యాలయాల తీరు మాత్రం మారడం లేదు. ఆచరణకు ఆమడ దూరంలో ప్రభుత్వ పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలల్లో కనీస మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం అంతంత మాత్రమే ఉంది. విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తేనే బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని స్పష్టమవుతున్నా, పాలకులు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

### మధ్యాహ్న భోజనానికి వంట గదుల సెగ! :

ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపరిచే పనిలో భాగంగా మధ్యాహ్న భోజనం అందజేస్తున్న క్రమంలో, క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భోజనం తయారు చేసే వంట గదుల కొరత, గ్యాస్ సిలిండర్ల కొరతతో అన్ని పాఠశాలల్లో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, అసంపూర్తిగా నిలిచిపోయిన తరగతి గదులు, వంటశాలల కొరత, నీటి సమస్యలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల పరిసరాలు చెత్తాచెదారంతో నిండి ఉండటంతో రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది.

### అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన పాడుబడ్డ పాఠశాల భవనాలు :

మేడ్చల్ పట్టణంలోని అర్జున్ వాడ, రథం షాల సమీపంలో, అంగన్వాడీ కేంద్రానికి ఎదురుగా పాడుబడి ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఈ పాడుబడ్డ భవనం ఇండ్ల మధ్యలో ఉండటం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. దీనికి తోడు ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో మద్యం బెల్ట్ షాపులు వెలిశాయని, దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేదని మాజీ వార్డు సభ్యులు గల్వ మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

### ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యటన :

మేడ్చల్ పట్టణంలోని పాడుబడిన ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ వసతి గృహాలను ఫోరం ఫర్ ఆర్టిఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బృందం శుక్రవారం సందర్శించింది. మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయలక్ష్మి అధ్యక్షతన ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పనిచేస్తుందని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ గుప్త, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు నాచారం విజయ లక్ష్మి, ఎం.లావణ్య, మేడ్చల్ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, నర్సింహులు పటేల్, మాజీ వార్డు సభ్యులు గల్వ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఫోరం ఫర్ ఆర్టీఐ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన డిమాండ్లు :



శిథిలావస్థకు చేరిన తరగతి గదులను తక్షణమే పునర్నిర్మించి విద్యార్థినులకు, విద్యార్థులకు ప్రత్యేకంగా రక్షిత మరుగుదొడ్ల, తాగునీటి సౌకర్యం కల్పించాలి. మధ్యాహ్న భోజన పథకం సజావుగా సాగేలా ఆధునిక వంట గదులు, గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలి. జనవాసాల మధ్య ఉన్న పాడుబడ్డ భవనాలను తొలగించి, అసాంఘిక కార్యకలాపాలకు, బెల్ట్ షాపులకు అడ్డుకట్ట వేయాలి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి విద్యావ్యవస్థ బలోపేతానికి, ప్రభుత్వ పాఠశాలల మనుగడకు తగిన నిధులు విడుదల చేసి మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# మేడ్చల్‌లో 'పిచ్చి'కుక్కల గురక..
# గుప్పిట్లో ప్రాణాలు

- రెండేళ్ల బాలుడితో సహా రెండు రోజుల్లో 13 మందిపై దాడి
- రాఘవేంద్ర నగర్ కాలనీలో రక్తసిక్తమైన వీధులు
- పురపాలక కమిషనర్‌కు బాధితుల కాలనీవాసుల ఘోష
- రెండు రోజుల్లో 13 మంది క్షతగాత్రులు.. బాలుడికి తీవ్ర గాయాలు
- కాలనీల్లో నరకం.... పిల్లలు, వృద్ధుల పరిస్థితి అగమ్యగోచరం
- రహదారులపై మృత్యుపాశాలు పురకపాలక కార్యాలయం ముట్టడి : కమిషనర్‌కు వినతిపత్రం
- తక్షణ చర్యలకు డిమాండ్

**మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలోని పరిసర ప్రాంతాలు ప్రస్తుతం భయానక వాతావరణాన్ని తలపిస్తున్నాయి. వీధి కుక్కల స్వైరవిహారంతో స్థానిక ప్రజలు ఇంటి నుండి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. నిన్న మొన్నటి వరకు సాధారణంగా ఉన్న కుక్కలు, ఒక్కసారిగా పిచ్చిపట్టినట్లు జనంపై విరుచుకుపడుతున్నాయి. గడిచిన 48 గంటల్లోనే ఏకంగా 13 మంది అమాయకులు ఈ మూగజీవాల దాడిలో తీవ్రంగా గాయపడి రక్తసిక్తమవ్వడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.**

**మేడ్చల్, నేడు న్యూస్ :** కాలనీలో పరిస్థితి రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. నిన్న ఒక్కరోజే వీధుల వెంబడి వెళ్తున్న ఎనిమిది మందిని కుక్కలు వెంటాడి మరీ కరిచాయి. ఆ భయం నీడ నుంచి కోలుకోకముందే శుక్రవారం మరో ఐదుగురు కుక్కల దాడికి



బలయ్యారు. బాధితుల్లో అత్యధికులు రక్షణ లేని చిన్న పిల్లలే ఉండటం గమనార్హం. ముఖ్యంగా స్థానిక నివాసి వీరి ప్రదీప్ కుమార్ అనే కేవలం రెండు సంవత్సరాల పసికందుపై కుక్కలు గుంపుగా దాడి చేశాయి. బాలుడి ముఖం, కంటిపై భాగం మరియు తలపై కుక్కలు పీకేయడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆ బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇందుకు సంబంధించిన హృదయవిదారకర చిత్రాలు స్థానికులను కన్నీరు పెట్టిస్తున్నాయి.

### కాలనీల్లో నరకం.... పిల్లలు, వృద్ధుల పరిస్థితి అగమ్యగోచరం :

సాయంత్రం వేళల్లో ఇళ్ల ముందు ఆడుకునేందుకు కూడా పిల్లలు భయపడుతున్నారు. కాలనీ వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు, పిల్లలు కనిపించగానే ఒక్కసారిగా వేటాడుతున్నట్లు విరుచుకుపడుతున్నాయి. రాత్రి సమయాల్లో లేదా తెల్లవారుజామున వృద్ధులు అత్యవసర పనులపై బయటకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. కుక్కలు ఒక్కసారిగా మొరుగుతూ వెంటబడటం వల్ల వృద్ధులు కిందపడిపోవడం, తీవ్రమైన మానసిక ఆందోళనకు గురికావడం జరుగుతోంది.

### రహదారులపై మృత్యుపాశాలు :

కేవలం పాదచారులకే కాదు, ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారికి కూడా ఈ కుక్కలు పెద్ద శాపంగా మారాయి. వాహనాల శబ్దం వినబడగానే కుక్కలు అకస్మాత్తుగా రోడ్డుపైకి దూకుతున్నాయి. దీంతో బైక్‌లు అదుపు తప్పి కిందపడిపోవడంతో పలువురు వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారు. మరోవైపు, కాలనీల్లోని చెత్త కుప్పల వద్ద వందలాది కుక్కలు చేరుతున్నాయి. ఆహారం కోసం అవి ఒకదానితో ఒకటి పోరాడుకుంటూ అర్ధరాత్రి వేళల్లో భీకరంగా అరుస్తూ స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఈ దారుణ పరిస్థితులపై స్థానిక కాలనీ నేత వీరి హరి గౌడ్ ఆధ్వర్యంలో ఆగ్రహించిన కాలనీవాసులు మేడ్చల్ పురపాలక కార్యాలయానికి తరలివెళ్లారు. పురపాలక కమిషనర్ ను కలిసి, తాము ఎదుర్కొంటున్న నరకయాతనను వివరించారు. గాయపడిన పిల్లల ఫోటోలను, వివరాలను కమిషనర్‌కు చూపిస్తూ రాతపూర్వక ఫిర్యాద సమర్పించారు.

### బాధితుల డిమాండ్ :

మా పిల్లల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కలను పట్టుకెళ్లాలి. జనాభా నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ-రేబిస్ వ్యాక్సినేషన్లు వేగవంతం చేయాలి. ఇంకా ఎంతమంది రక్తం చిందించాక అధికారులు మేల్కొంటారు?" అని కాలనీవాసులు నిలదీస్తున్నారు. ఈ వినతిపత్రంపై అధికారులు సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే, కాలనీవాసుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హరి గౌడ్ హెచ్చరించారు.






# మేడ్చల్ దారిదోపిడీ కేసు

- పోలీసుల విచారణలో కీలక పురోగతి!
- సీసీటీవీ ఆధారాలతో ఒకరి అరెస్ట్..
- మరొకరి కోసం గాలింపు
- నిందితుడిపై గతంలోనూ కేసులున్నట్లు వెల్లడి
- పోలీసు బృందానికి డీసీపీ ఎన్.కోటిరెడ్డి ఐపీఎస్ అభినందనలు

**మేడ్చల్, నేడు న్యూస్ :** మేడ్చల్ కోర్టు సమీపంలో గత నెల జరిగిన ఒక మహిళపై దారిదోపిడీ యత్నం కేసులో పోలీసుల విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో సాంకేతిక ఆధారాల సాయంతో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు మేడ్చల్ పోలీసులు అధికారికంగా వెల్లడించారు. పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటూరి శుభరాణి అనే మహిళ మే 29న రాత్రి విధులు ముగించుకుని మేడ్చల్ కోర్టు ఏరియాలోని పెట్రోల్ పంప్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. బైక్‌పై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఆమెను మాటల్లో పెట్టి, మెడలోని చైన్‌ను లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### 100కు పైగా సీసీ కెమెరాల పరిశీలన :

ఈ కేసు దర్యాప్తును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో క్రైమ్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ఘటనా స్థలంతో పాటు నిందితులు ప్రయాణించినట్లు భావిస్తున్న తూప్రాన్ మరియు పరిసర ప్రాంతాల మార్గాల్లో దాదాపు 100 నుండి 120 సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో లభించిన ఆధారాల ప్రకారం నిందితుల కదలికలను గుర్తించి జవహర్‌నగర్ పరిధిలో నివసిస్తున్న రూప్‌సింగ్ చతుర్‌సింగ్ తక్ (31) అనే వ్యక్తిని మేడ్చల్ క్రైమ్ టీమ్, సీసీఎస్ బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. ఇతడు మూలత మహారాష్ట్రలోని హింగోలి జిల్లాకు చెందినవాడని, ప్రస్తుతం ఇక్కడ స్క్రాప్ షాపులో పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతనిపై గతంలో కర్ణాటకలోని బీదర్ పోలీస్ స్టేషన్‌లో కూడా ఒక కేసు నమోదై ఉన్నట్లు విచారణలో తేలింది. నిందితుడి నుంచి ఒక ద్విచక్రవాహనం (ఆ్రా03జఔ3964), మొబైల్ ఫోన్ మరియు ఇమిటేషన్ చైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ కేసులో ా1గా పేర్కొంటున్న శంషర్ సింగ్ అనే మరో వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

### పోలీసు బృందానికి డీసీపీ ఎన్. కోటిరెడ్డి ఐపీఎస్ అభినందనలు :

సమర్థవంతంగా విచారణ జరిపి నిందితుడిని పట్టుకున్న మేడ్చల్ జోన్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి ఐపీఎస్, సీసీఎస్ డీసీపీ ముత్యం రెడ్డి, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, మేడ్చల్ ఎస్‌హెచ్ఓ ఎ. సత్యనారాయణ, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కిరణ్ మరియు సీసీఎస్ బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.



# ప్రజల ఆరోగ్యమే ధ్యేయం..

## వర్షాకాలానికి ముందే అప్రమత్తమైన సర్పంచ్ మేదరి టోనీ

**కారేపల్లి, నేడు న్యూస్:** గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సింగరేణి గ్రామ సర్పంచ్ మేదరి టోనీ వర్షాకాలానికి ముందుగానే అప్రమత్తమయ్యారు. రాబోయే వర్షాకాలంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని భావించి గ్రామపంచాయతీ కార్యాలయంలో చికెన్ షాప్‌లు, వాటర్ ప్లాంట్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ షాప్‌ల నుంచి వెలువడే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో, గ్రామ శివార్లలో లేదా రహదారుల వెంట పడవేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యర్థాల వల్ల దుర్వాసనలు వ్యాపించి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. అలాగే వాటర్ ప్లాంట్ యజమానులు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వాటర్ క్యాన్ల సరఫరా కోసం ఉపయోగించే ట్రాలీలను మైనర్లకు ఇవ్వకుండా చూడాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గ్రామాభివృద్ధి, ప్రజల ఆరోగ్య భద్రత పట్ల సర్పంచ్ మేదరి టోనీ చూపుతున్న చొరవ గ్రామ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

# ప్రజల గుండెచప్పుడు వింటున్న రాందాస్ నాయక్

## ఆదర్శంగా "డయల్ యువర్ ఎమ్మెల్యే"



**కారేపల్లి, నేడు న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేపట్టిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమం ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. ప్రజలకు నేరుగా అందుబాటులో ఉంటూ వారి సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు తమ సమస్యలను మధ్యవర్తులు లేకుండా నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించడం విశేషంగా నిలుస్తోంది. ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రాందాస్ నాయక్ సేవా తత్వం యువతకు, ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిగా నిలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నెల 14వ తేదీ (ఆదివారం) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమంలో ప్రజలు 8520914577 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు, వినతులు, సూచనలను ఎమ్మెల్యేతో నేరుగా పంచుకోవచ్చని ఎమ్మెల్యే కార్యాలయం వెల్లడించింది. ప్రజలకు చేరువగా ఉండి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న రాందాస్ నాయక్ చేపట్టిన ఈ కార్యక్రమం వైరా నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు పొందుతూ, ప్రజా ప్రతినిధి--ప్రజల మధ్య విశ్వాస బంధాన్ని మరింత బలోపేతం చేస్తోందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



# పోలంపల్లితండాలో అమ్మవారికి బోనాలు

**కారేపల్లి నేడు న్యూస్:** కారేపల్లి మండలంలోని పోలంపల్లి తండాలో అమ్మవారి బోనాల వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని డీజే వాయిద్యాల నడుమ ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు "తల్లి... మా గ్రామాన్ని చల్లగా చూడాలి, రైతులకు మంచి పంటలు పండాలి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి" అంటూ అమ్మవారిని వేడుకున్నారు. రైతులు తమ పొలాల్లో సమృద్ధిగా పంటలు పండాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని మొక్కులు చెల్లించుకున్నారు. పోలంపల్లి సర్పంచ్, దిశ కమిటీ సభ్యురాలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాభివృద్ధితో పాటు రైతాంగం కష్టాలు తొలగి పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు మోసుకుంటూ భక్తి గీతాల నడుమ ఊరేగింపులో పాల్గొనగా, యువకులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ ఉత్సాహాన్ని చాటారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని, రైతుల పొలాలు పచ్చదనంతో కళకళలాడాలని గ్రామ ప్రజలు కోరుకున్నారు.




# నకిలీ పత్తి విత్తనాల ముఠా గుట్టురట్టు

- రూ.30 లక్షల విలువైన నకిలీ సీడ్ పాచ్‌లు, 2 టన్నుల నాసిరకం విత్తనాలు స్వాధీనం
- ముగ్గురు అరెస్ట్.. ప్రధాన నిందితుడికి గతంలోనూ కేసులు

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** రైతులను మోసం చేస్తూ నకిలీ పత్తి విత్తనాలను మార్కెట్లోకి విడుదల చేసేందుకు సిద్ధమైన ముఠాను ఎస్‌వోటీ మల్కాజిగిరి టీమ్-2, తిరుమలగిరి పోలీసులు భగ్నం చేశారు. ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేసి రూ.30 లక్షల విలువైన 12,800 నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లు, సుమారు రెండు టన్నుల అనుమానాస్పద నాసిరకం పత్తి విత్తనాలు, ఒక మారుతీ ఈకో వాహనం, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్‌కు చెందిన నర్మదా సాగర్ అగ్రి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ మార్కెటింగ్ మేనేజర్ సోలంకే యశ్వంత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ యార్డు వద్ద తనిఖీలు నిర్వహించిన పోలీసులు యెరువ బాలషో రెడ్డి అలియాస్ శివారెడ్డి, కపర్తి బెంజిమెన్, డొంగా శ్రీనులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 12,800 నకిలీ పౌచ్‌లు లభించాయి. ప్రధాన నిందితుడు యెరువ బాలషో రెడ్డి గతంలో షాద్‌నగర్, రాజేంద్రనగర్, భూత్పూర్ పోలీస్ స్టేషన్లలో నమోదైన పలు మోసం, విత్తన చట్టాల ఉల్లంఘన కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ఐపీఎస్ పర్యవేక్షణలో, డీసీపీలు చి. శ్రీధర్, కె.మనోహర్, అదనపు డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్, తిరుమలగిరి ఎస్‌హెచ్‌వో జి.నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

# నిషేధిత జాబితా నుండి పట్టా భూములను తొలగించండి

## తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ముఖ్య సలహాదారు జక్క వెంకట్ రెడ్డి



**మేడిపల్లి, నేడు న్యూస్:** పట్టా భూములు రిజిస్టర్డ్ ప్లాట్లను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చడాన్ని తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ఖండించింది. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఘట్కేసర్, బోడుప్పల్ మున్సిపల్ సర్కిల్స్ పరిధిలోని పట్టా భూములు, రిజిస్టర్డ్ ప్లాట్లను తాజాగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ నిషేధిత జాబితాలో చేర్చడంపై తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ ముఖ్య సలహాదారులు, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల సత్యనారాయణ తీవ్రంగా వ్యతిరేకించారు. మేడిపల్లి చెంగిచెర్ల చౌరస్తాలోని హోటల్ తులిప్స్ గ్రాండ్ హోటల్ లో నిరహించిన అత్యవసర రౌండ్ టేబుల్ సమావేశంలో కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, ఘట్కేసర్, మేడిపల్లి మండలాల పరిధిలోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, ప్లాట్ కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టా భూములు, ఇప్పటికే రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది మంది ప్రజలు, భూ యజమానులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం వల్ల రియల్ ఎస్టేట్ రంగంతో పాటు సాధారణ ప్రజలకు కూడా భారీ నష్టం జరుగుతోందని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని, త్వరలోనే మేడ్చల్ జిల్లా కలెక్టర్‌తో సమావేశమై సమస్యకు సంబంధించిన అన్ని అంశాలను వివరించి నిషేధిత జాబితా నుంచి అర్హమైన పట్టా భూములను తొలగించేలా చర్యలు చేపట్టడం, ప్రభుత్వం ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, న్యాయబద్ధమైన పట్టా భూములు మరియు రిజిస్టర్డ్ ప్లాట్లపై విధించిన ఆంక్షలను వెంటనే ఎత్తివేసి రిజిస్ట్రేషన్లు పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి, ఉప్పల్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ శాడగొండ కరుణాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సామ సతీష్ రెడ్డి, రమేష్, శ్రీకాంత్ రెడ్డి, ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మల్లారెడ్డి, అరుణ్, శశిధర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి పూర్ణచందర్, యాదగిరి, బిక్షపతి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు దశాబ్దాల సేవలకు ఘన సన్మానం

## పుచ్చకాయల వెంకటేశ్వర్ల పదవీ విరమణ మహోత్సవంలో కొనియాడిన సర్పంచ్ రంజిత్ కుమార్



**కారేపల్లి నేడు న్యూస్:** గాదెపాడు గ్రామ ప్రజలకు నాలుగు దశాబ్దాలుగా పోస్టల్ బ్యాంకింగ్ సేవలను అందిస్తూ విశేష గుర్తింపు పొందిన పుచ్చకాయల వెంకటేశ్వర్ల పదవీ విరమణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది. కార్యక్రమంలో గాదెపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ రంజిత్ కుమార్, ఉపసర్పంచ్ ఉపేందర్, సహకార బ్యాంకు చైర్మన్ మువ్వ విజయబాబు, మాజీ ఇల్లందు మున్సిపల్ చైర్మన్ డీవీ, గ్రామ కార్యదర్శి కుమార్, గ్రామ పెద్దలు మర్ల వెంకటరెడ్డి, బత్తుల బాబురావు, ఎలమంచి భాస్కరరావు, మధ్యబోయిన జోగయ్య, గడిపర్తి వీరన్న తదితరులు పాల్గొని పుచ్చకాయల వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ, వెంకటేశ్వర్లు తన ఉద్యోగ జీవితమంతా ప్రజాసేవకే అంకితమై పనిచేశారని కొనియాడారు. గ్రామంలోని ప్రతి వర్గానికి పోస్టల్ బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. పోస్టల్ సేవింగ్స్ ఖాతాలు, బీమా పథకాలు, సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు, పోస్టల్ పెట్టుబడి పథకాలు వంటి అనేక సేవలను గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చి వారి ఆర్థిక భద్రతకు తోడ్పడ్డారని పేర్కొన్నారు. అంతేకాకుండా, రైతుల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సమయంలో సహకారం అందిస్తూ గ్రామ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారని అన్నారు. నాలుగు దశాబ్దాల పాటు నిబద్ధతతో సేవలందించిన వెంకటేశ్వర్ల సేవలు గ్రామ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తాయని చెప్పారు. పదవీ విరమణ అనంతరం కూడా గ్రామాభివృద్ధికి తన అనుభవాన్ని, సలహాలను అందిస్తూ ప్రజలకు మార్గదర్శకుడిగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు వెంకటేశ్వర్ల సేవలను స్మరించుకుంటూ అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆరోగ్యంతో, ఆనందంగా పదవీ విరమణ జీవితం గడపాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ భూమి ఏడాదిలోనే ప్రైవేటు స్థలంగా ఎలా మారింది?

## ఎమ్మెల్యే భూములను ఎందుకు కాపాడలేకపోతున్నారు? : బీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్



**సికింద్రాబాద్, నేడు న్యూస్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివాదాస్పద సర్వే నంబర్ 157/1 ప్రభుత్వ భూమి వ్యవహారంపై బీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్ పలు ప్రశ్నలు లేవనెత్తారు. శుక్రవారం ఆ భూమిని పరిశీలించిన ఆయన, పోలీసుల అనుమతితో అక్కడే మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ భూమిగా ఉన్న స్థలం ఒక్క ఏడాదిలోనే ప్రైవేటు భూమిగా ఎలా మారిందని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లిందనే విషయంపై స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, సంబంధిత అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే సాయన్న తన హయాంలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు కట్టుబడి పనిచేశారని, ప్రస్తుతం అలాంటి చొరవ కనిపించడం లేదని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించిన ఆరు వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఈ భూమిని ఎందుకు వినియోగించలేదని ప్రశ్నించారు. గత ఎన్నికల సమయంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం బోయినపల్లి మార్కెట్ యార్డు సమీపంలోని ఎనిమిది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌లకు వినతిపత్రం అందజేశారని గుర్తు చేశారు. అందుకు సంబంధించిన ఫొటోలను మీడియాకు చూపిస్తూ, ఇదే భూమి అని పేర్కొన్నారు. అలాంటి ప్రభుత్వ భూమి ఏడాదిలోనే ప్రైవేటు భూమిగా ఎలా మారిందని ప్రశ్నించిన ఆయన, మాజీ ఎమ్మెల్యే సాయన్న భూములను కాపాడితే ప్రస్తుత ఎమ్మెల్యే ఎందుకు కాపాడలేకపోతున్నారని నిలదీశారు. ఎమ్మార్వో, ఆర్డీవో, కంటోన్మెంట్ బోర్డు చర్యలపై స్పందించకపోవడం, కోర్టులో సవాలు చేయకపోవడం వెనుక కారణాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా పనులు ప్రారంభం కాలేదని, పేద ప్రజలకు ఆశలు చూపించి ఇప్పుడు మౌనం వహించడం సరికాదన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడకుండా ప్రైవేటు వ్యక్తులు హద్దులు ఏర్పాటు చేస్తుంటే ప్రభుత్వం, తహసీల్దార్, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములు పేదలకే చెందాలని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పేదల పక్షాన ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# ఆ కాల్స్ నమ్మొద్దు: కెనడాలోని భారత పౌరులకు అడ్వైజరీ



**కెనడా:** కెనడాలోని భారత పౌరులకు అక్కడి కాన్సులేట్ కీలక అడ్వైజరీ జారీ చేసింది. కాన్సులేట్ అధికారుల పేరుతో సైబర్ మోసగాళ్లు నకిలీ కాల్స్ చేస్తున్నారని.. వాటిని నమ్మొద్దని విజ్ఞప్తి చేసింది. వీసా, ఇమిగ్రేషన్ హోదా, శాశ్వత నివాసం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. అటువంటి మోసపూరిత కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని.. ఫేక్ కాల్స్ వచ్చిన వెంటనే తమకు గానీ స్థానిక పోలీసులకు గానీ సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే ఇటువంటి మోసపూరిత కాల్స్ వచ్చినట్లు అనేకమంది భారతీయులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపింది. తమ పేరుతో వచ్చే కాల్స్‌కు సమాధానం ఇవ్వొద్దని.. ఎటువంటి వ్యక్తిగత సమాచారాన్నీ వారితో షేర్ చేసుకోవద్దని భారత కాన్సులేట్ సూచించింది. వీసాల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి ఏవైనా అదనపు పత్రాలు అవసరమైతే వాటికోసం తమ అధికారిక మెయిల్ నుంచి సందేశం పంపిస్తామని తెలిపింది. అత్యవసర సమయాల్లో తమ అధికారులు వీసా దరఖాస్తుదారులకు కాల్ చేస్తే దానికి సంబంధించిన నెంబర్, ఇతర వివరాలను తెలియజేస్తారని స్పష్టం చేసింది.



# 12 ఏళ్లలో దేశ రూపురేఖలు మార్చిన మోదీ పాలన

## ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు ప్రధాని అంకితభావం : కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లలో దేశంలో ఎన్నో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కీలక సమస్యలను పరిష్కరించి చారిత్రాత్మక నిర్ణయాలను అమలు చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పలు చట్టపరమైన, పరిపాలనా సంస్కరణలు తీసుకువచ్చినట్లు తెలిపారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నట్లుగా ఆర్టికల్-370 రద్దు, అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం, ట్రిపుల్ తలాక్ రద్దు, ఉగ్రవాద నిర్మూలనకు కఠిన చర్యలు వంటి చారిత్రాత్మక నిర్ణయాలను మోదీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. దేశ గౌరవం, అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలో అరుదైన రీతిలో ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న 12 ఏళ్ల కాలంలో ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా దేశ సేవలో నిమగ్నమైన నాయకుడు నరేంద్ర మోదీ అని కొనియాడారు. తన తల్లి మరణించిన రోజున కూడా వ్యక్తిగత విషాదాన్ని పక్కనపెట్టి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని విధి నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప నాయకుడు మోదీ అని పేర్కొన్నారు. ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలో తాను "ప్రధానమంత్రి కాదు.. ప్రధాన సేవకుడిని" అని చెప్పిన మోదీ, గత 12 ఏళ్లలో ఆ మాటలను చేతల్లో చూపించి నిరూపించారని తెలిపారు. నీతి, నిజాయితీ, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ అవినీతి ఆరోపణలకు తావులేకుండా పరిపాలన అందిస్తున్న నాయకుడు నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న నాయకత్వం మోదీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు నర్మదా మల్లికార్జున్, కార్పొరేటర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నాం

## రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంపై తిరుపతి సభలో చంద్రబాబు

**తిరుపతి, జూన్ 12 :** స్వర్ణాంధ్రే శ్వాసగా పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హామీల అమలుతో నిజాయితీ నిరూపించుకుంటున్నామని తెలిపారు. సంపద సృష్టిస్తేనే సంక్షేమం గురించి చెప్పాలి.. ఆదాయాన్ని పెంచేవాళ్లకే సంక్షేమం పంచే అధికారం ఉంటుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అన్నీ తాకట్టు పెట్టే వాళ్లకు రాష్ట్రం గురించి మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఎమ్మార్వో ఆఫీసు, ఆసుపత్రులను కూడా తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో తిరుపతి సమీపంలోని దామినేడులో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్రమంత్రులు, కూటమి నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. పి4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు. నా రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలు పెట్టా. ఇదే రోజున నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశా.. రెండేళ్లయింది. రాష్ట్రాన్ని గెలిపిద్దామని 2024 ఎన్నికల్లో మోదీ, పవన్, నేను కలిశాం. ప్రజల ఆశీర్వాదంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విభజన వల్ల కొంత నష్టపోతే.. గత ప్రభుత్వం వల్ల పూర్తిగా నష్టపోయాం. 2019లో ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైంది. విధ్వంస పాలన వల్ల వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. గత ప్రభుత్వ విధ్వంసంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయారు. తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపి వేధించారు. ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా నన్ను 53 రోజులు జైల్లో ఉంచారు. పవన్ కల్యాణ్‌ను అడుగడుగునా అడ్డుకొని వేధించారు. మూడు రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడి చిచ్చు పెట్టారని మండిపడ్డారు. ఎన్నికల్లో విజయం చూసి పొంగిపోలేదు.. రాష్ట్ర దుస్థితి చూసి కుంగిపోలేదు. హంద్రీనీవా పూర్తి చేసి కుప్పానికి నీళ్లు తీసుకొచ్చాం. ఈ ఏడాది కల్యాణి డ్యామ్‌కు నీరు తీసుకొచ్చి.. శ్రీశైలం మల్లన్న, తిరుపతి వెంకన్నను కలుపుతాం. అన్ని రంగాలపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశాం. ప్రజా ప్రభుత్వం నడిపించే వ్యక్తిగా అన్ని వివరాలు బహిర్గతమే. డబుల్ ఇంజిన్ సర్కారు వల్ల ప్రయోజనాలు ఇవాళ చూస్తున్నాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించింది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం. పోలవరం, అమరావతి, విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్ సహా అనేక విషయాల్లో కేంద్రం అండగా నిలిచింది. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రంగా అన్ని జిల్లాలను అభివృద్ధి చేస్తున్నాం. అన్ని నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తాం. ఎన్టీఆర్ భరోసా.. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమం అన్నారు. గిట్టుబాటు ధర లేకపోతే రైతులను ఆదుకునే కార్యక్రమాలు చేస్తున్నాం. పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గిస్తున్నాం. ఓటమి ఎరుగని నాయకుడు నరేంద్రమోదీ. గుజరాత్, దిల్లీలో మోదీ అనేక కార్యక్రమాలు చేయగలిగారు. 12 ఏళ్లలో ప్రధాని మోదీ సారథ్యంలో దేశం అభివృద్ధివైపు దూసుకెళ్లిందని సీఎం అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.



## తృణమూల్ నేతకు బంగ్లాదేశ్ అతివాద సంస్థలతో సంబంధాలు

### రెబల్ ఎంపీ కకోలీ ఘోష్

**కోల్‌కతా, జూన్ 12 :** తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ ఆ పార్టీ మాజీ ఎంపీపై సంచలన ఆరోపణలు చేశారు. తృణమూల్ మాజీ రాజ్యసభ ఎంపీ అహ్మద్ హసన్ ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్‌కు చెందిన అతివాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ మేరకు పశ్చిమబెంగాల్ సీఎం సువేందు అధికారికి లేఖ రాశారు. ఇమ్రాన్‌కు బంగ్లాదేశ్ సంస్థలతో సంబంధాలు ఉండొచ్చని పలు మీడియా నివేదికలు చేసిన బహిరంగ ఆరోపణలను ఘోష్ తన లేఖలో ప్రస్తావించారు. టీఎంసీ హయాంలో చికెన్ నెక్ కారిడార్ (సిలిగుడీ కారిడార్)తో సహా కొన్ని సున్నితమైన ప్రాంతాలలో భారత సైన్యం, సరిహద్దు భద్రతా దళం అభ్యర్థించిన భూమిని కేటాయించకపోవడం పైనా పలు అనుమానాలు లేవనెత్తారు. వీటిపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. రెబల్ ఎమ్మెల్యే రితబ్రత టీఎంసీలో తిరుగుబాటు లేవనెత్తిన అంశంతో తమకేమీ సంబంధం లేదని కకోలీ ఘోష్ పేర్కొన్నారు. ఆయన అసెంబ్లీలో ఉంటే తాను పార్లమెంట్‌లో ఉన్నానని అన్నారు. రెండు వర్గాలు వేర్వేరు రాజకీయ లక్ష్యాలను అనుసరిస్తున్నాయన్నారు.

#### మీడియా చేతికి టీఎంసీ ఎంపీల లేఖ

ఇటీవల లోక్‌సభలోని 20 మంది టీఎంసీ ఎంపీలు ఎన్డీయేకు మద్దతిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే. వారు స్పీకర్‌కు రాసిన లేఖ నేడు జాతీయమీడియా చేతికి వచ్చింది. దీంతో రెబల్ ఎంపీలలో కకోలీ ఘోష్, శతాబ్ది రాయ్, భారత మాజీ క్రికెటర్, ఎంపీ యూసుఫ్ పఠాన్, నటి సయోనీ ఘోష్, నటుడు శత్రుఘ్న సిన్హా మొదలైన కీలక నేతలు ఉన్నట్లు వెల్లడయ్యింది.



## ప్రజలు అధికారంతో పాటు.. అతిపెద్ద బాధ్యత అప్పగించారు

- ప్రజలు ఇచ్చిన తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశ
- సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కారం కావడం మేలు
- సమిష్టి కృషితోనే విశాఖ ఉక్కును కాపాడుకోగలిగాం
- రెండేళ్ల విజయోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

**తిరుపతి, జూన్ 12 :** ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని జనసేన అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు.. రాష్ట్ర భవిష్యత్‌కు కొత్త దిశను చూపిన చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ప్రజలు రెండేళ్ల క్రితం కేవలం అధికారాన్ని మాత్రమే కాకుండా బాధ్యతను కూడా అప్పగించారని చెప్పారు. ఆ బాధ్యతను నెరవేర్చేందుకు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషి చేస్తున్నాయని తెలిపారు. గ్రామమే దేశ అభివృద్ధికి కేంద్ర బిందువని పేర్కొన్న పవన్.. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరి భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలు గ్రామ పంచాయతీల స్థాయిలోనే జరగాలని అన్నారు. గ్రామంలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల, జిల్లా లేదా ఎమ్మెల్యే స్థాయికి వెళ్లకుండా స్థానికంగానే పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రస్తుతం ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు వెళ్తోందని, రాష్ట్రంలో ఉన్న వందలాది స్థానిక ప్రజాప్రతినిధుల అధికారాలను బలహీనపరిచి, మొత్తం వ్యవస్థను ఎమ్మెల్యేల చుట్టూ కేంద్రీకరించడం సరికాదన్నారు. వ్యవస్థలు బలహీనపడితే కులాలు, ప్రాంతీయ భావాలు బలపడతాయని హెచ్చరించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోవడంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమిష్టి ప్రయత్నాలు ఫలించాయని పవన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజా తీర్పు ఒక తరం భవిష్యత్‌కు నమ్మకాన్ని ఇచ్చిందని, రాష్ట్ర అభివృద్ధి, యువత భవిష్యత్, ఉపాధి అవకాశాల కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ప్రజలు మౌనంగా ఉన్నా సరైన సమయంలో తమ తీర్పుతో చరిత్రను మార్చగలరని 2024 ఎన్నికలు మరోసారి నిరూపించాయని పేర్కొన్నారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితమని పవన్ అభిప్రాయపడ్డారు. అధికారం పంచుకోవడం కోసం కాకుండా బాధ్యతను పంచుకుని రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగానే గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ కేవలం 21 సీట్లకే పరిమితమైందంటూ విమర్శలు చేశారని, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆ రోజు తాము చేసిన రాజకీయ త్యాగమే కూటమి విజయానికి పునాది అయిందని అన్నారు. తెలుగు రాష్ట్రాలు మరింత అభివృద్ధి చెందాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను దాటి జాతీయ అభివృద్ధి దిశగా ఆలోచించాలని సూచించారు. గ్రామాలకు నిర్ణయాధికారం, బాధ్యతలు పూర్తిస్థాయిలో చేరాయా అనే అంశంపై ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి, జాతీయ పండుగలు నిర్వహించడానికి కూడా నిధులు లేవని అధికారులు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితిని 'బ్రోకెన్ గవర్నెన్స్'గా అభివర్ణించారు. గ్రామాల్లో రోడ్లు ఎక్కడ వేయాలి? ఎవరికీ ఇళ్లు అవసరం వంటి నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా ప్రజల మధ్య గ్రామసభల్లో తీసుకోవాలని పవన్ పేర్కొన్నారు. గ్రామసభలు బలపడితే సర్పంచ్‌లు బలపడతారని, అప్పుడు ఎమ్మెల్యేలు స్థానిక సమస్యల కంటే యువత భవిష్యత్తు, పరిశ్రమలు, అభివృద్ధి వంటి పెద్ద అంశాలపై దృష్టి సారించగలరని అన్నారు. ప్రజాస్వామ్యానికి గ్రామపంచాయతీలే అతిపెద్ద విశ్వవిద్యాలయాలని పేర్కొన్న ఆయన, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజకీయ ప్రస్థానం కూడా గ్రామస్థాయి నుంచే ప్రారంభమైందని గుర్తు చేశారు. గత రెండేళ్లలో రాజకీయ స్థిరత్వం సాధించడంతో పాటు గ్రామాల వరకు ప్రజాస్వామ్యాన్ని తీసుకెళ్లామని చెప్పారు.

# బ్యాంక్ లింకేజీ రుణాలు ఆగిపోయాయా..?

- సెర్ప్, మెప్మాల విలీనం
- డోలాయమానంలో సిబ్బంది, సంఘాలు
- బ్యాంక్ లింకేజీ రుణాలు అందక ఇబ్బందులు పడుతున్న మహిళా సంఘాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు




**మేడ్చల్ నేడు బ్యూరో:** రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని మహిళా సంఘాలకు రెగ్యులర్ గా బ్యాంక్ లింకేజీ రుణాలు అందుతుండగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని సంఘాలకు మాత్రం గత రెండు, మూడు నెలలుగా రుణాలు అందటం లేదు. అయినా, ఇటు సెర్ప్ ఉన్నతాధికారులు గానీ అటు మెప్మా ఉన్నతాధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం చేపట్టిన విలీన విధానం, ఆయా శాఖల ఉన్నతాధికారులు అనుసరిస్తున్న నిర్లక్ష్యపు విధానాలు గడిచిన ఆరు మాసాలుగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని డి.ఆర్.డి.ఏ, మెప్మా విభాగాలను డోలాయమానంలో పడేశాయి. ఈ విధానాల మూలంగా మహిళా సంఘాల పై ప్రతికూల ప్రభావం పడుతోంది. మహిళలను కోటీశ్వరులను చేసేదాకా నిద్రపోయేది లేదని ఒక వైపు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చెబుతుండగా, మేడ్చల్ జిల్లాలోని మహిళా సంఘాలకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించవలసిన అవసరాన్ని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు నొక్కి చెబుతున్నాయి.

#### విలీనమే కారణమా...?:

ఔటర్ రింగ్ రోడ్డు లోపల అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలను జీ.హెచ్.ఎం.సి లో విలీనం చేయడం ద్వారా ఆ ప్రాంతాలకు అన్ని మౌలిక వసతులు కల్పించడం ద్వారా మరింత అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్, బోడుప్పల్, ఫిర్జాదిగూడా, నిజాం పేట్ లాంటి నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, అలాగే తొమ్మిది మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీ లో విలీనం చేసింది. ఇది జరిగి ఆరు నెలలకు పైగానే గడిచిపోయింది. అందరికీ తెలిసిందే. దీనితో, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని మేజర్ పార్ట్ జీహెచ్ఎంసీ లోకి వెళ్లిపోగా, శామీర్ పేట్ మండలంలోని 7 గ్రామాలు, మూడు చింతలపల్లి లోని 13 గ్రామాలు, మేడ్చల్ మండలంలోని 14 గ్రామాలు మొత్తం కలిపి 34 గ్రామాలు మాత్రమే మిగిలి పోయాయి. వీటిని కూడా 1. ఎల్లంపేట్ ( మేడ్చల్ మండలం ) 2. అలియాబాద్ (శామీర్ పేట మండలం ), 3. మూడు చింతల పల్లి ( ఉమ్మడి శామీర్ పేట్ మండలం ) మూడు మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతమైన మేడ్చల్ జిల్లా మొత్తంగా పట్టణీకరణ ( అర్బన్ జిల్లాగా ) అయిపోయింది. పై మూడు మున్సిపాలిటీల్లో కలిపి 68 వార్డులుగా ఏర్పాటు చేసి, ఎన్నికలు కూడా జరిపించారు.

#### అగమ్యగోచరంగా మహిళా సంఘాల పరిస్థితి :

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పట్టణీకరణ ( అర్బన్ జిల్లాగా మారడంతో) కావడంతో జిల్లా పరిషత్, మండల పరిషత్ లు రద్దయ్యాయి. జిల్లా డీ.ఆర్.డీ.ఏ కూడా ఉనికి లేకుండా పోయింది. అప్పటి వరకు జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ( సెర్ఫ్) లో బాగంగా ఉన్న స్వయం సహాయక సంఘాలు కొన్ని జీ.హెచ్.ఎం.సి పరిధిలోకి మరి కొన్ని మెప్మా పరిధిలోకి వెళ్లిపోయాయి. అప్పటి నుంచి వాటి పరిస్థితి సందిగ్ధంలో పడిపోయింది.

#### సంఘాలు విలీనమైనా వాటి ఖాతాల అప్‌లోడింగ్‌లో నిర్లక్ష్యం :

అయితే, జిల్లాలోని మహిళా సంఘాలు సెర్ఫ్ నుంచి జీ.హెచ్.ఎం.సి, మెప్మా ల పరిధిలోకి వెళ్లిపోయినా వాటి ఖాతాలు, కోడ్ నెంబర్స్ ఆన్ లైన్ లో సెర్ఫ్ నుంచి మెప్మ వెబ్ సైట్ లోకి అప్లోడింగ్ ప్రక్రియ పూర్తి కాక పోవడంతో సంఘాల కార్యక్రమాలు, బ్యాంక్ లింకేజీ రుణాలు ఇతర కార్యక్రమాల్లో స్తబ్ధత నెలకొంది. జీ.హెచ్.ఎం.సి లో విలీనమైన సంఘాల సభ్యులు అలాగే మున్సిపాలిటీలోనీ మెప్మా లో కలిసిన సంఘాలు రెండూ కూడా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఇది జిల్లాలోని అధికారులకు తెలిసినా ఏమీ చేయలేక పోతున్నారు.


#### సిబ్బంది విభజన, నియామకంపై పట్టింపేదీ ...?

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా గ్రేటర్ లో విలీనమై, అర్బన్ గా మారి, పంచాయతీలు, డి.ఆర్.డి.ఏ , పంచాయతీ రాజ్ తదితర శాఖలు రద్దు అయినా, సిబ్బంది విభజన లేదా నియామకం చేయక పోవడం మూలంగా గడచిన కొన్ని నెలలుగా ఈ శాఖల్లో పంచాయతీ రాజ్, డి.ఆర్.డి.ఏ, మెప్మా ఇతర శాఖల్లో సందిగ్ధత కొనసాగుతోంది. ఆయా శాఖల్లో అధికారులు, సిబ్బంది గత కొన్ని నెలలుగా ఎవరు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి. జిల్లాలో మెప్మా ను చూసిన బాధ్యులు సస్పెండ్ అయ్యారు. దీని బాధ్యతలు డి.ఆర్.డి.ఏ పీడీ కి ఇచ్చారు. ఇప్పటికే సదరు అధికారి డి.ఆర్.డీ.వో తో పాటు డీ.పీ.ఓ ఇంచార్జీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మెప్మా బాధ్యతలు కూడా ఆయనకే అప్పగించారు. దీనితో దీనిపైనా కూడా పూర్తి స్థాయిలో దృష్టి పెట్టలేని పరిస్థితి. ఇక సదరు అధికారి సెలవుపై వెళ్లితే ఆ శాఖల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. ఈ శాఖలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అలసత్వం, నిర్లక్ష్యం, నాన్చివేత ధోరణిల ప్రభావం స్వయం సహాయక సంఘాల పై ప్రతికూలంగా మారిపోతున్నది. ప్రభుత్వ పథకాలు అందకుండా పోతున్నాయి. దీనిని గుర్తించాల్సిన అవసరం ఉందనీ స్వయం సహాయక సంఘాల నాయకులతో పాటు ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

## టిండర్ యాప్‌లో హనీట్రాప్

### రూ.లక్షలు పోగొట్టుకున్న మహిళా న్యాయమూర్తి

**చండీఘడ్, జూన్ 12 :** హనీట్రాప్‌లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమూర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమూర్తికి సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. టిండర్ యాప్, వాట్సప్‌లలో ఇరువురి మధ్య జరిగిన పూర్తి సంభాషణలను సేకరించాలని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. నిధుల బదిలీకి వివరాలు.. నిందితుడి ఫోన్‌కి సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణను తొందరగా నిర్వహించాలని పేర్కొంది.



## రప్పా.. రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదు

### రెడ్‌బుక్ తనపని తను చేసుకుంటూ పోతుంది

### తిరుపతి సభలో మంత్రి లోకేశ్ వ్యాఖ్యలు

**తిరుపతి, జూన్ 12 :** కూటమి పాలనలో జేసీబీలు, దాడులు, హత్యలు, బూతులు లేవని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రెండేళ్ల కూటమి ప్రభుత్వ నమ్మకం, సంక్షేమంపై తిరుపతి దామినీడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి జోలికి వెళ్లొద్దని నాటి సీఎంను హెచ్చరించామని.. దేవుడితో పెట్టుకుంటే పరిస్థితి ఏంటో ఇవాళ అనుభవిస్తున్నారని వ్యాఖ్యానించారు. రాయలసీమ అంటే ఎన్టీఆర్‌కు చాలా ప్రేమ అని తెలిపారు. నాడు కరువు వస్తే జోలె పట్టుకుని సీమ ప్రజలను ఆదుకున్నారని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేశారు. రాయలసీమను రాయల్‌సీమగా మార్చామని మంత్రి చెప్పారు. రాయలసీమలో రత్నాలు పండేలా చేసిన వ్యక్తి సీబీఎన్ అని కొనియాడారు. గొడ్డలి పార్టీ అరాచక పాలన చూశామన్నారు. టీడీపీ జెండా లేకుండా చేస్తామని నాడు వైసీపీ నేతలు ప్రగల్భాలు పలికారని.. ఇవాళ ప్రజలే వైసీపీ జెండా పీకేసి టీమ్ 11 తీర్పు ఇచ్చారని సెటైర్ విసిరారు. వైసీపీ అరాచకాలు చూస్తూ ఊరుకోమని.. రెడ్‌బుక్ దాని పని అది చేసుకుంటూపోతుందని స్పష్టం చేశారు. రప్పా రప్పా అంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 'మనది గూగుల్... వాళ్లది గొడ్డలి. మనది ఫైటర్‌జెట్.. వాళ్లది ఫ్యాక్షన్. మనది కియా.. వాళ్లది కిడ్నాప్. మనది క్రెడిబిలిటీ.. వాళ్లది క్రిమినాలిటీ' అంటూ మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై మంత్రి నారా లోకేష్ ప్రశంసలు కురిపించారు. 'ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలిసిన వ్యక్తి పవన్ అన్న' అని పేర్కొన్నారు. తనకు సొంత అన్న లేని లోటును పవన్ అన్న తీర్చారన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. 'ఇప్పుడు ఏపీలో బూతులు లేవు, జేసీబీలు లేవు. అక్రమాలు, దౌర్జన్యాలు కనిపించడం లేదు. ప్రజలకు రెండేళ్లుగా స్వాతంత్ర్యం లభించింది' అని పేర్కొన్నారు. గతంలో తాను చేపట్టిన పాదయాత్రలో దేవుడితో పెట్టుకోవద్దు అని చెప్పానని, ఆ మాటలను పట్టించుకోకుండా వ్యవహరించిన వారి పరిస్థితి ఇప్పుడు అందరికీ కనిపిస్తోందని మంత్రి నారా లోకేష్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీతో పోల్చిన లోకేష్.. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. వైసీపీ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన లోకేష్.. 'టీడీపీ జెండా లేకుండా చేస్తామని చెప్పారు.



## హెచ్-1బీ వీసా ఫీజు పెంపు వ్యవహారం

### బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ



**వాషింగ్టన్, జూన్ 12 :** హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గేది లేదని తేల్చారు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట లభించనట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యం త్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లేని భావిస్తున్నారు.

## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడికి 30ఏళ్ల జైలు

**దక్షిణ కొరియా :** దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తు న్నారు. కాగా 2024 అక్టోబర్‌లో ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపినందు కు గాను ఆయనకు మరో 30ఏళ్లు జైలు శిక్ష విధిస్తున్నట్లు దక్షిణ కొరియా లోని కోర్టు తీర్పు వెలువరించింది. కిమ్ సేనను రెచ్చగొట్టేందుకే ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెం టును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు ఆయన విధించిన 'మార్షల్ లా' విఫలమవడంతో ఓ సాకు సృష్టించుకోవడానికి ఈ చర్యలకు పాల్పడినట్లు వెల్లడించింది. యూన్‌తో పాటు, ఆయన మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్, డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ మాజీ అధిపతి యో ఇన్ హ్యూంగ్, డ్రోన్ ఆపరేషన్స్ కమాండ్స్ మాజీ అధిపతి కిమ్ యోంగ్-దేలను న్యాయస్థానం దోషులుగా నిర్ధరించింది. వారికి కూడా జైలు శిక్ష విధించింది. అత్యవసర పరిస్థితిని సృష్టించడం కోసం ఉత్తర కొరియాను రెచ్చగొట్టడానికి నిందితులు సైనిక చర్య అనే ముసుగును ఉపయోగించారని విమర్శించింది. అయితే చెత్త బెలూన్లను తమ దేశంపై ప్రయోగించి.. తమను రెచ్చగొట్టడానికి యత్నించిన ఉత్తర కొరియాకు తగిన బుద్ధి చెప్పడానికే మాజీ అధ్యక్షుడు ఆ దేశంలోకి డ్రోన్లను పంపారని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. వారి నుంచి దేశానికి రక్షణ కల్పించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు.

## ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్
# 500 సెమీస్‌కు పీవీ సింధు

తెలుగు తేజం, స్టార్ షట్లర్ పీవీ సింధు అద్భుత ఫామ్‌లో ఉంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్‌లో తైపీకి చెందిన చెన్ సు యుపై 21-6, 21-9 తేడాతో పీవీ సింధు విజయం సాధించింది. ఏకపక్షంగా సాగిన పోరులో కేవలం 27 నిమిషాల్లోనే చెన్‌ను చిత్తు చేయడం గమనార్హం. ఈ తైపీ ప్లేయర్ ఏమాత్రం ప్రతిఘటన ఇవ్వలేకపోయింది. సెమీస్‌లో జపాన్‌కు చెందిన యమగుచితో సింధు తలపడనుంది. వీరిద్దరిలో సింధు 15-13 ఆధిక్యంలో ఉంది.








## దూసుకెళ్లిన సూచీలు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా- ఇరాన్ మధ్య త్వరలో శాంతి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు, అంతర్జాతీయంగా ముడిచమురు దిగుమతులు దిగి రావడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్ సూచీలూ రాణించాయి. సెన్సెక్స్ ఓ దశలో 1700 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 23,600 ఎగువన ముగిసింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.9.7 లక్షల కోట్లు పెరిగి రూ.452.33 లక్షల కోట్ల నుంచి రూ.462.05 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 74,709.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,832.55) భారీ లాభాల్లోనే ప్రారంభమైంది. రోజంతా కొనుగోళ్ల మద్దతుతో సూచీలు కళకళలాడాయి. ఇంట్రాడేలో 75,608.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1695.40 పాయింట్ల లాభంతో 75,527.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 461.30 పాయింట్ల లాభంతో 23,622.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఇండిగో, టైటాన్, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు మాత్రమే నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 86 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4224 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇరాన్‌తో త్వరలో శాంతి ఒప్పందం కుదరబోతోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వారాంతంలోపు ఇరు దేశాలు ఈ డీల్‌పై సంతకాలు చేయ-ంబోతున్నాయని తెలిపారు. హర్మూజ్ తిరిగి తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ఈ ప్రకటన ప్రపంచ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్‌లో కొత్త ఉత్సాహానికి కారణమైంది. ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు దిగి వచ్చాయి. గత కొన్ని రోజులుగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 90 డాలర్ల ఎగువన ట్రేడవుతూ వస్తుండగా.. శాంతి ఒప్పందంపై అంచనాలతో మళ్లీ 86 డాలర్ల స్థాయికి చేరడం దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి ఆర్థిక వ్యవస్థలకు ఊరట కల్పించే అంశం. శాంతి ఒప్పందంపై ఆశలతో ఆసియా మార్కెట్‌లన్నీ లాభాల్లో ట్రేడయ్యాయి. జపాన్ నిక్కీ దాదాపు 3 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతం మేర లాభాల్లో ముగిశాయి. ఇతర ఆసియా మార్కెట్‌లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్‌లు సైతం లాభాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్‌లూ దూసుకెళ్లాయి.



## అంతర్జాతీయ క్రికెట్‌కు 'కేన్ మామ' వీడ్కోలు

న్యూజిలాండ్ స్టార్ ఆటగాడు కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ జరుగుతుండగానే అతడు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. 35 ఏళ్ల కేన్ కివీస్ తరఫున 110 టెస్టులు, 175 వన్డేలు, 93 టీ20లు ఆడాడు. తన 16 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 19వేలకుపైగా పరుగులు సాధించాడు. ఇందులో 48 సెంచరీలు, ఆరు డబుల్ సెంచరీలు ఉన్నాయి. దాదాపు ఎనిమిదేళ్లపాటు (2016-24) న్యూజిలాండ్‌కు సారథ్యం వహించాడు. రెండుసార్లు ఐసీసీ వరల్డ్ కప్ ఫైనల్స్‌కు తన జట్టును చేర్చాడు. తొలి ఐసీసీ టెస్టు ఛాంపియన్‌షిప్ విజేతగా కివీస్ నిలవడంలో కేన్ కెప్టెన్సీదే కీలక పాత్ర. 2010లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన కేన్ విలియమన్స్ గతేడాది టీ20లకు వీడ్కోలు పలికాడు. ఇప్పుడు మిగతా రెండు ఫార్మాట్లకూ గుడ్‌బై చెప్పేశాడు. "ఆటకు వీడ్కోలు పలకడంపై గత కొన్ని రోజులుగా ఆలోచిస్తూనే ఉన్నా. ఇప్పుడు ఇదే సరైన సమయంగా భావిస్తున్నా. అంతర్జాతీయ క్రికెట్ పట్ల నాకు ఎప్పుడూ బలమైన తపన, ఆసక్తి ఉండేవి. న్యూజిలాండ్ తరఫున ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నా సర్వశక్తులూ ఒడ్డా. ఆ భావనే నన్ను గర్వపడేలా చేస్తోంది. ఇలాంటి గొప్ప జట్టుకు నాయకత్వం వహించడమూ ఆనందంగా ఉంది. నా మనసులో ఎప్పుడూ టీమ్‌కు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇన్నేళ్లూ జట్టులో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నా" అని కేన్ తెలిపాడు.




## రిషభ్ పంత్‌ను పూర్తిగా పక్కన పెట్టొద్దు: ఇర్ఫాన్ పఠాన్

రిషభ్ పంత్ అనగానే టెస్టుల్లో దూకుడుగా ఆడతాడు.. మిగతా ఫార్మాట్లలో ప్రభావం చూపించడనే కామెంట్లు వినిపిస్తాయి. అతడి ఆటతీరు కూడా అలానే ఉంది. కానీ, భారత మాజీ పేస్ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ మాత్రం పంత్ మళ్లీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కీలకంగా మారతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. పంత్ విషయంలో బీసీసీఐ సెలక్టర్లు మరీ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. అఫ్గానిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌కు పంత్ ఎంపిక కాని విషయం తెలిసిందే. శనివారం తొలి వన్డే జరగనుంది. "వన్డేల్లో వికెట్ కీపర్‌గా ఇప్పుడు కేఎల్ రాహుల్ తొలి ఛాయిస్. అతడు ఓపెనర్‌గానూ.. ఐదు లేదా ఆరో స్థానంలోనూ బ్యాటింగ్ చేయగలడు. అతడికి బ్యాకప్‌గా సెలక్టర్లు ఇషాన్ కిషన్‌ను తీసుకొచ్చారు. టాప్ ఆర్డర్‌లో అతడు బ్యాటింగ్ చేస్తాడు. షార్ట్ బంతులను కూడా చక్కగా ఆడేస్తున్నాడు. ఇది స్మార్ట్ సెలక్షన్. మూడో ఆప్షన్‌గా సంజు శాంసన్. అతడికి ఎప్పుడు అవకాశం వచ్చినా వన్డేల్లో సత్తా చాటాడు. గత టీ20 ప్రపంచ కప్‌లోనూ సంజు కీలక ఇన్నింగ్స్‌లు ఆడటం చూశాం కదా.. ఇక రిషభ్ పంత్ విషయానికొద్దాం.. ఈ సందర్భంగా సెలక్టర్లకు నేనొక విజ్ఞప్తి చేస్తున్నా. 2027 వన్డే ప్రపంచ కప్ సెలక్షన్స్‌లో పూర్తిగా అతడిని పక్కన పెట్టొద్దు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అతడి ఫామ్ గొప్పగా లేదని తెలుసు. గతంలో ఇషాన్ కిషన్ కూడా జట్టులో నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత రాణించి మళ్లీ టీమ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. సారథిగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని ఝార్ఖండ్‌కు అందించాడు. అందుకే, అతడిని పంత్ స్ఫూర్తిగా తీసుకోవాలి. వైట్‌బాల్ క్రికెట్‌లోకి పునరాగమనం చేయాలి" అని ఇర్ఫాన్ తెలిపాడు. పంత్ చివరిసారిగా 2024లో వన్డే మ్యాచ్ ఆడాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైనా.. రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. గత ఐపీఎల్‌లోనూ గొప్ప ప్రదర్శన చేయలేదు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్సీని వదిలేశాడు.

## 500 మందికి పైగా
# యువ రెజ్లర్లపై అనర్హత

### వయసులో వ్యత్యాసం..



యువ రెజ్లర్లపై భారత రెజ్లింగ్ సంఘం కఠిన చర్యలు తీసుకుంది. దాదాపు 500 మందికి పైగా యువ రెజ్లర్లను టోర్నీలో పాల్గొనకుండా వేటు వేసింది. వారంతా తప్పుడు వయసు ధ్రువీకరణ పత్రాలు సమర్పించడమే అందుక్కారణం. 'ఆధార్' ఆధారిత వెరిఫికేషన్ వ్యవస్థను రెజ్లింగ్ ఫెడరేషన్ తీసుకొచ్చింది. బర్త్ సర్టిఫికెట్‌కు, ఆధార్‌లోని వయసుకు వ్యత్యాసం ఉందని గుర్తించింది. దీంతో అండర్-17 నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనకుండా 500 మందికి పైగా రెజ్లర్లను అనర్హులుగా ప్రకటించింది. జూన్ 6 నుంచి 8 వరకూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఈ టోర్నీ జరిగింది. పురుషుల, మహిళల విభాగంలో దాదాపు 1200 మంది వరకు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వయసు నిర్ధరణకు బర్త్ సర్టిఫికెట్లతోపాటు ఆధార్ కార్డులను జత చేయాలని రెజ్లింగ్ సంఘం స్పష్టం చేసింది. ఈ రెండింట్లో వయసు వ్యత్యాసం కనిపించడంతో వారిపై అనర్హత వేటు పడింది. ఇందులో మెన్స్ ఫ్రీస్టైల్ విభాగంలో 300 మంది, గ్రీకో రోమన్ విభాగంలో 125, మహిళల విభాగంలో 100 మందిపైనా సంఘం చర్యలు తీసుకుంది. కొంతమంది పుట్టిన ప్లేస్, తేదీలు, ఆధార్ కార్డులోని వివరాలతో మ్యాచ్ కాలేదు. మరికొందరు తాము పుట్టిన తేదీ కంటే చాలా ఏళ్ల తర్వాత బర్త్ సర్టిఫికెట్లను తీసుకోవడం గమనార్హం. ఒక రెజ్లర్ బర్త్ సర్టిఫికెట్‌లో సంవత్సరం 2007లో దిల్లీలో పుట్టినట్లు ఉంది. ఆధార్ కార్డులో మాత్రం 2004లో హరియాణాలో జన్మించినట్లు ఉండటం విమర్శలకు దారితీసింది. ఈ వ్యవహారంపై డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్‌సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏజ్ గ్రూప్ పోటీల కోసం వెరిఫికేషన్ వ్యవస్థను బలోపేతం చేసినట్లు తెలిపారు. "వయసు విషయంలో మోసాలు జరిగినట్లు మేం గుర్తించాం. వారిపై కఠిన చర్యలు తీసుకున్నాం. అధిక వయసు వారితో పోటీల్లో పాల్గొనడం వల్ల అర్హత కలిగిన అథ్లెట్లు ఇబ్బందిపడే అవకాశం ఉంది. భవిష్యత్తులోనూ అండర్-15, అండర్-17, అండర్-20 టోర్నీల సమయంలో వయసును కచ్చితంగా నిర్ధరిస్తాం. జూన్ 14, 15 తేదీల్లో జరగనున్న అండర్-17 వరల్డ్ ఛాంపియన్‌షిప్ మహిళల ట్రయిల్స్‌లోనూ ఇవే ప్రొటోకాల్స్ పాటిస్తాం" అని సంజయ్ స్పష్టంచేశారు.

## ఫిఫా వరల్డ్ కప్‌లో
# దక్షిణ కొరియా శుభారంభం

### చెకియాపై సూపర్ విక్టరీ



ఫిఫా ప్రపంచ కప్‌లో ఆసియా జట్టు దక్షిణ కొరియా శుభారంభం చేసింది. చెకియాపై 2-1 తేడాతో విజయం సాధించింది. గ్రూప్‌లో తలపడిన ఇరు జట్లూ గెలుపు కోసం చివరివరకూ పోరాడాయి. అయితే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేదు. కానీ, రెండో అర్ధ భాగం నుంచి ఆట రసవత్తరంగా మారింది. రెండో సగం మొదలైన కాసేపటికే చెకియా ఆటగాడు లాడిస్లావ్ గోల్ కొట్టి తన జట్టుకు ఆధిక్యం ఇచ్చాడు. మ్యాచ్ 59వ నిమిషంలో తొలి గోల్ నమోదైంది. మరికాసేపటికే సౌత్ కొరియా ప్లేయర్ హవాంగ్ బోయిమ్ 67వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరును సమం చేశాడు. ఇక కాసేపు గోల్స్ కోసం ఇరుజట్లూ శ్రమించాయి. 80వ నిమిషంలో దక్షిణ కొరియా ఆటగాడు ఓ హైన్ గ్యు గోల్ కొట్టి 2-1 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆట అదనపు సమయంలోనూ కొరియా పట్టువిడవకుండా కాపాడుకుంది. చెకియాను గోల్ కొట్టనీయకుండా కట్టడి చేయగలిగింది. ఆటలో ఎక్కువ భాగం బంతిపై నియంత్రణ దక్షిణ కొరియాకే ఉంది. చెకియా 16 పొరపాట్లు చేయగా.. దక్షిణ కొరియా 9 మాత్రమే చేసింది.

# ఆ ఇద్దరినీ వైభవ్ అధిగమిస్తాడు

### దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్



ప్రపంచ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతాలు సృష్టిస్తాడని దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ అన్నాడు. అతడు భారత క్రికెట్‌కు ఖజానా లాంటివాడని అభివర్ణించాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ కంటే వైభవ్‌లోనే ఎక్కువ సత్తా ఉందని వ్యాఖ్యానించాడు. ఇప్పుడు అతడి వయ-సులో ఉన్న పిల్లల్లో ఇలాంటి టాలెంట్‌ను చూడలేదని చెప్పాడు. "మీరంతా వైభవ్ సూర్యవంశీని సచిన్ లేదా విరాట్‌లా ఉన్నాడని భావిస్తారు. కానీ, వారిద్దరి కంటే కూడా ఇతడిలో చాలా సత్తా ఉందని అనిపిస్తోంది. వైభవ్ కెరీర్ ముగిసేసరికి ఆ దిగ్గజాలను అధిగమిస్తాడని అనుకుంటున్నా. ఇప్పుడున్న అంతర్జాతీయ క్రికెటర్ల కంటే కూడా వైభవ్ చాలా బెటర్. అండర్ -15, అండర్ -19 జట్లలో అద్భుతమైన ఆటగాళ్లను చూస్తూ ఉంటాం. కానీ, నాకు తెలిసి దక్షిణాఫ్రికా లేదా ఇతర దేశాల్లో వైభవ్ వంటి నైపుణ్యం ఉన్న యువ క్రికెటర్ లేడు. మా దేశంలో టాలెంట్‌కు కొదవేం లేదు. కానీ, వైభవ్ వంటి బెస్ట్ ప్లేయర్ లేడని మాత్రం చెప్పగలను. అందుకే, అతడు భారత జట్టుకు అతిపెద్ద ఖజానా అంటున్నా" అని స్టెయిన్ తెలిపాడు.

### జాగ్రత్తగా చూసుకోవాలి..

"ప్రస్తుతం వైభవ్ వయసు కేవలం 15 ఏళ్లే. రాబోయే కాలం అత్యంత విలువైంది. అతడిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత భారత క్రికెట్ జట్టు మేనేజ్‌మెంట్‌పై ఉంది. వైభవ్‌ను ఎంత బాగా చూసుకుంటే.. టీమ్‌ఇండియాకు అంత బెనిఫిట్. ఒకవేళ అతడి ఆటను కోల్పోతే మాత్రం చాలా నష్టమవుతుంది. బంతిని చాలా బాగా ఆడతాడు. భారత్‌లో అతడి ఆటను దగ్గర్నుంచి చూశా. మంచి వికెట్లపైనా ఉత్తమ ఆటతీరు ప్రదర్శించాడు. విధ్వంసం సృష్టించిన తీరు బాగుంది. రబాడ ఒక్కడే వైభవ్‌ను కాస్త కట్టడి చేయగలిగాడు. మిగతా బౌలర్లు భారీగానే పరుగులు సమర్పించారు. మ్యాచ్ బరిలోకి దిగిప్పుడు భయపడుతూ ఉంటే సరిగ్గా బౌలింగ్ చేయలేం. అలాగే బ్యాటింగ్‌లోనూ నాణ్యమైన ఆట ఆడలేం. వైభవ్‌ను షార్ట్ బంతులతో మాత్రమే అడ్డుకొనేందుకు అవకాశం ఉంది" అని స్టెయిన్ వెల్లడించాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లకు వైభవ్ ఎంపికైన సంగతి తెలిసిందే.



## మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు

అంతర్జాతీయ పరిణామాలతో ఇటీవల కాస్త దిగొచ్చిన బంగారం, వెండి ధరలు శుక్రవారం మళ్లీ పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు శాంతించడంతో ఈ లోహాలకు డిమాండ్ దక్కింది. దీంతో దేశీయ విపణిలోనూ వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,52,200కు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3వేల పైన పెరిగింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.49 లక్షలు పలికింది. దీని ధర ఒక్క రోజే దాదాపు రూ.9వేల మేర పెరగడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు పెరిగాయి. నేడు ఔన్సు పుత్తడి ధర 4,205 డాలర్లు పలికింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు 100 డాలర్ల పైన పెరిగింది. ఇక ఔన్సు వెండి ధర 67.32 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1.50లక్షలు, వెండి ఫ్యూచర్స్ ధర రూ.2.43లక్షల వద్ద కొనసాగుతోంది. ఇరాన్‌పై తాజా దాడుల్ని విరమించుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టెహ్రాన్‌తో చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, ఆ దేశ అగ్రనాయకత్వం తమ ప్రతిపాదనలకు అంగీకరించిందని చెప్పారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గొచ్చనే అంచనాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు కూడా దిగొచ్చాయి. అటు మన దేశ కరెన్సీ రూపాయి విలువ కూడా భారీగా కోలుకుంది. నేటి మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే 60 పైసలు బలపడి 95.25 వద్ద ట్రేడ్ అవుతోంది.



## ధరలు పెంచిన టాటా మోటార్స్..

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్ లిమిటెడ్ కార్ల ధరలను పెంచేసింది. జులై 1 నుంచి కార్ల ధరలను 1.5 శాతం చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్‌తో పాటు, ఎలక్ట్రిక్ వాహన ధరలనూ పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇప్పటికే ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ జూన్ నుంచి కార్ల ధరలను రూ.30 వేల వరకు పెంచిన వేళ.. టాటా మోటార్స్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ముడి సరకు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం ఒత్తిళ్ల కారణంగా పాక్షికంగా ధరల పెంపు చేపట్టాల్సి వస్తోందని టాటా మోటార్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. అయితే, వినియోగదారులపై పెద్దగా ప్రభావం పడకుండా కొంత మొత్తం మాత్రమే బదిలీ చేస్తున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపు వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. టియాగో, ఆల్ట్రోజ్, టిగోర్, పంచ్, నెక్సాన్, సియారా, హ్యారియర్ వంటి సంప్రదాయ ఇంజిన్‌తో నడిచే కార్లతో పాటు టియాగో ఈవీ, టిగోర్, పంచ్ ఈవీ, నెక్సాన్ ఈవీ, కర్వ్ ఈవీ, హ్యారియర్ ఈవీ మోడళ్లను టాటా మోటార్స్ విక్రయిస్తోంది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com